ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 13 సెప్టెంబరు 2025 | 5




GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
BACKWARD CLASSES WELFARE DEPARTMENT - List of Socially and Educationally Backward Classes - Change of the Caste description "Goud" at Sl.No.4 under Group-B of the Backward Classes List - Amendment to G.O.Ms.No.1793, Education Department, Dt.23.09.1970 - Orders - Issued.

BACKWARD CLASSES WELFARE (F) DEPARTMENT

G.O.MS.No. 6 Dated: 11-09-2025
Read the following:-

G.O.Ms.No.1793, Education Department, Dt.23.09.1970.

* * *

ORDER:-

In the G.O. 1st read above, Government declared that the castes and communities specified in the Annexure-1 to that G.O. are socially and educationally backward and classified them into five Groups as 'A', 'B', 'C', 'D' and 'E'. The caste **"Goud (Ediga, Gowda (Gamalla), Kalalee, Goundla, Settibalija, and Srisayana (Segidi))"** is included at Sl.No.4 under Group-'B' of State list.

2. It has been brought to the notice of the Government that certain objections were received from 'Setti Balija' caste people that 'Goud' is shown as prefix to their caste 'Setti Balija' and that they are not sub-sect or sub-caste of any caste.

3. After careful consideration of the matter, Government have decided to issue caste certificates mentioning the specific caste name alone to the people belonging to 'Ediga', 'Gowda (Gamalla)', 'Kalalee', 'Goundla', 'Settibalija' and 'Srisayana (Segidi)' castes. The Government accordingly issue the following amendment to G.O.Ms.No.1793, Education Department, Dt.23.09.1970:-

AMENDMENT

The following shall be inserted as against at Sl.No.4 under Group 'B' to Annexure - I to G.O.Ms.No.1793, Education Department, Dt.23.09.1970 and read

ఖరీఫ్‌లో ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం!

- రైతులకు సరిపడే గోనె సంచులు ఏర్పాటు
- రవాణా ఇబ్బందులు లేకుండా కార్యాచరణ
- ఐదు జిల్లాల్లో 19.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- జిల్లాల వారీగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- సమీక్షలు నిర్వహించిన మంత్రి నాదెండ్ల

6



కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ఖరీఫ్ సీజన్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్. చిత్రంలో ఏపీ పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, ఎండీ మంజీర్ జిలాని సామూన్, వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు

శెట్టిబలిజ కుల సర్టిఫికెట్లు జారీకి సంబంధించిన జీవో

శెట్టిబలిజ కుల సర్టిఫికెట్లు జారీ చేయాలంటూ ప్రభుత్వం జీవో.. హర్షాతిరేకాలు

కాట్రేనికోన, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు శెట్టిబలిజ సామాజిక వర్గానికి న్యాయం జరిగింది. గత ప్రభుత్వం అమలుచేసిన గౌడ(శెట్టిబలిజ) కుల సర్టిఫికెట్ల స్థానంలో శెట్టిబలిజ బీసీ-బి సీరియల్ నెం.4గా మార్పుచేస్తూ జీవో ఎంఎస్ నెం.6ను ఈనెల 11న ప్రభుత్వం విడుదల చేసింది. వెంటనే సంబంధిత సాఫ్ట్వేర్ ఏర్పాటు చేసి కులం సర్టిఫికెట్లు జారీ చేయాలంటూ బీసీ వెల్ఫేర్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో గౌడ పేరుతో ఇచ్చే జీవో జారీకాగా, ఆ తర్వాత అమలులోకి వచ్చింది. ఇప్పుడు కూడా గౌడ (శెట్టిబలిజ)గా కులం సర్టిఫికెట్లు రావడంతో శెట్టిబలిజ సామాజిక వర్గం నుంచి అభ్యంతరాలు, వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపై ఆ సామాజిక వర్గీయులు మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి తమ ఆందోళనను వ్యక్తంచేశారు. వెంటనే ఆయన ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వంలో జరిగిన సాఫ్ట్వేర్ లోపాలను సరిదిద్దకుండా యథావిధిగా కులం సర్టిఫికెట్లు జారీ చేయడాన్ని సీఎంకు మంత్రి సుభాష్ వివరించారు. వెంటనే స్పందించిన సీఎం శెట్టిబలిజలకు బీసీ-బీ కులం సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకున్నారు. శెట్టిబలిజతోపాటు ఈడిగ, కలేలి, గౌండ్ర, శ్రీశైన కులాలకు వారి కులం పేరుతోనే సర్టిఫికెట్ల జారీకి ఆ జీవో జారీచేశారు.

రైస్ మిల్లర్ల బకాయిలు రూ.వెయ్యి కోట్లు చెల్లించండి

- ఉమ్మడి జిల్లాల సమీక్షలో మంత్రిని కోరిన మిల్లర్లు
- పీఏసీఎస్ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి
- పీఏసీఎస్‌లు ఆర్థిక పరిపుష్టికి సహకారం ఇవ్వాలి

6



అల్లకల్లోలం : ఇది ఉప్పాడ బీచ్ రోడ్డు..13 కిలోమీటర్లు.. ఇక్కడ గత 22 ఏళ్లుగా 1360 ఎకరాల భూమి సముద్రంలో కలిసిపోయింది.. రెండు ఆలయాలు కనుమరుగైపోయాయి.. 150పైనే నివాసాలు కడలి గర్భంలో కలిసిపోయాయి. అయినా ఇంకా ఉప్పెనలా ఎగసిపడుతూనే ఉంది.. ఊళ్లపైకి ముంచుకొస్తూనే ఉంది.. గురువారం అలలు ఉప్పాడ రోడ్డును ఇలా ఛిద్రం చేసేశాయి..

ఉప్పెనలా..

ముంచుకొస్తున్న కడలి

కాకినాడలో ఉప్పాడ వద్ద తీరాన్ని సముద్రం ఊచకోత కోస్తోంది. రాకాసి అలలతో ముంచేస్తూ అంతకంతకూ ముందుకు వచ్చేస్తూ హడలెత్తిస్తోంది. ఏ తీరంలోను లేనంతగా భయపెడుతూ వేల ఎకరాల భూములు, ఇళ్లను కలిపేసుకుంటోంది. గడచిన కొన్నేళ్లలో 1,360 ఎకరాలు కడలిలో కలిసిపోయాయంటే కోత తీవ్రత ఎలా ఉందో ఊహించుకోవచ్చు. గతంలో నిర్మించిన జియోట్యూబ్ ధ్వంసం, ఉప్పాడ సమీపంలో హార్బర్ నిర్మాణ పనుల ప్రభావం సైతం ప్రస్తుతం కోత పెరగడానికి కారణమవుతోంది. గత జగన్ సర్కారు కోత నివారణకు రూ.200 కోట్లతో తయారు చేసిన ప్రతిపాదనలను గాలికొదిలేయడమూ సమస్య తీవ్రతకు మరో కోణం.

\- (కాకినాడ, ఆంధ్రజ్యోతి)

- ఉప్పాడలో సముద్రపు కోత తీవ్రం
- అలల ధాటికి బీచ్ రోడ్డు మళ్లీ ధ్వంసం
- పోటు, అల్పపీడనానికీ అల్లకల్లోలం
- నాడు జగన్ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం
- ఉప్పాడలో 1,360 ఎకరాలు మాయం
- కోతపై చంద్రబాబు, పవన్ దృష్టి
- నిధులివ్వడానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్?
- కోనసీమలోనూ కన్నీటి తీరమే

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సముద్రపు అలల తాకిడికి తీర ప్రాంతం భారీగా కోతకు గురవుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని సుమారు 80 కిలోమీటర్ల పొడవున ఉన్న అంతర్వేది నుంచి యానాం వరకు ఉన్న తీరంలో తరచూ అలజడులు రేగి వందల ఎకరాల భూములు కడలిగర్భంలో కలిసిపోతున్నాయి. సముద్ర తీరం వెంబడి ఉన్న తొమ్మిది మండలాల్లోని 40కు పైగా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అంబేడ్కర్ కోనసీమలో తీరంలో కోతకు గురవుతున్న ప్రాంతాలు ఇలా..

కోనసీమలో..



అంతర్వేది, కేశవదాసుపాలెం, చింతలమోరి గ్రామాల్లో సముద్ర తీరం భారీగా కోతకు గురి కావడంతోపాటు కెరటాల తాకిడికి ఉప్పునీరు సమీప పంట పొలాల్లోకి చేరి పంటలను సర్వనాశనం చేస్తోంది. ఇటీవల అంతర్వేది పల్లిపాలెం తరచూ సముద్ర కెరటాల తాకిడికి ముంపునకు గురవుతోంది. పడమటిపాలెం, కేశనపల్లి, కరవాక, అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం, రామేశ్వరం మొగ, వాసాలతిప్ప, ఎస్.యానాం, బ్రహ్మసమేధ్యం నుంచి యానాం వరకు ఉన్న సముద్ర తీర ప్రాంతం భారీగానే కోతకు గురవుతోంది. అల్లవరం మండలం ఓడలరేవులోని వేల కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఓఎన్జీసీ ప్లాంటు వద్ద అర కిలోమీటరు మేర ముందుకు చొచ్చుకు వచ్చిన సముద్రం ప్లాంటు రక్షణ గోడను సైతం ఛిద్రం చేసి చొచ్చుకు వస్తున్నతీరు గ్రామస్తులను భయకంపితులను చేస్తోంది. ఓడలరేవు నుంచి కొమరగిరిపట్నం వరకు తీర ప్రాంత భూములన్నీ భారీగా కోతకు గురి కావడంతోపాటు ఐదారు అడుగుల మేర తీరాన్ని కోతకు గురి చేయడంతో సముద్ర స్నానాలకు వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. కాట్రేనికోన మండల శివారు బ్రహ్మసమేధ్యం తీరంలో సరుగుడు తోటలు సైతం కోతకు గురై కుప్పకూలుతున్నాయి. తుఫాను, అల్పపీడనాల సమయంలో సముద్రం అల్లకల్లోలంగా మారుతోంది. ఆ సమయంలో మీటరు నుంచి రెండు మీటర్ల మేర అలలు ఉవ్వెత్తున ఎగసిపడి తీరాన్ని కబళిస్తున్నాయి.


అల్లవరం మండలం ఓడలరేవులో ఓఎన్జీసీ ప్లాంటు వద్ద కోత (ఫైల్)

సముద్రంలో 1360 ఎకరాలు

ఉప్పాడ బీచ్ అంటే గుర్తుకొచ్చేది అందమైన నీలిసముద్రం.. అంతకుమించి గడచిన 22 ఏళ్లుగా సముద్రపు కోత అంతకంతకూ ముందుకొస్తూ కలవరపెడుతోంది. ఇప్పటివరకు సముద్ర గర్భంలో కరిగిపోయిన భూమి 1,360 ఎకరాలైతే కనుమరుగైపోయిన ఆలయాలు రెండు, నివాసాలు 150పైనే. ఉప్పాడ, సూరాడపేట, కోనపాపేటవద్ద అయితే మత్స్యకారుల ఇళ్లల్లోకి సముద్రం వచ్చేస్తోంది. ఉప్పాడకు సమీపంలో పోర్టులకు వచ్చే నౌకల కోసం బ్రేక్‌వాటర్స్ నిర్మించి అలల ఒత్తిడి తగ్గించారు. తీరా ఆ ఒత్తిడి ఉప్పాడకు మళ్లీ శాపంగా మారింది. ఇటీవల ఉప్పాడకు సమీపంలో ఫిషింగ్ హార్బర్ పనులు ఊపందుకున్నాయి. జెట్టీల కోసం భారీ బండరాళ్లతో సముద్రంలో గోడ నిర్మిస్తున్నారు. దీని ప్రభావం పక్కనే ఉన్న ఉప్పాడ కోతను మరింత పెంచుతోంది. కాకినాడ నుంచి ఉప్పాడకు వెళ్లాలంటే బీచ్ రోడ్డే గతి. పరిశ్రమలు, సెజ్, వందలాది హేచరీలకు ఈ రోడ్డే దిక్కు. కాకినాడ వాకలపూడి నుంచి ఉప్పాడ వరకు 13 కిలోమీటర్ల వరకు బీచ్ రోడ్డు ఉండగా, సముద్రపు కోత 9 కిలోమీటర్ల పరిధిలో అధికంగా ఉంది. బీచ్ రోడ్డుకు మరమ్మతులు చేయించకపోతే అనేక గ్రామాల ప్రజలకు ఇబ్బందే.

కోత ఆపేయొచ్చు.. ఇలా..

పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ కోతపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోత నివారణకు పరిష్కారం చూపాలని నిర్ణయించారు. నేషనల్ కోస్టల్ రీసెర్చ్ సెంటర్ (ఎన్‌సీఆర్‌సీ) శాస్త్రవేత్తలతో బీచ్ కోతపై అధ్యయనం చేయించారు. వేవ్ కరెంట్, సముద్రం అడుగున పరిణామాలు కారణమని తేల్చారు. అలల తీవ్రత తగ్గించేందుకు సముద్రం అడుగు నుంచి కాంక్రీట్‌గోడ నిర్మించాలని ప్రతిపాదించారు. ఉప్పాడకు దక్షిణం వైపు కాకినాడ నుంచి వచ్చే దారిలో మలుపు వద్ద సముద్రం పూర్తిగా ముందుకురావడంతో కొత్త బీచ్ సృష్టించాలని తేల్చారు. సీఎం ఆదేశాల మేరకు కోత నివారణ ప్రణాళిక నిధులకు కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ కేంద్రంతో సంప్రదింపులు జరపగా రూ.323 కోట్లు ఇవ్వడానికి కేంద్రం పచ్చజెండా ఊపింది.


మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులు పండించిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలి

మంత్రికి ఏపీ రైతు సంఘం వినతి

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పండించిన పంటలను పూర్తిగా కొనుగోలు చేయాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కాకినాడ కలెక్టరేట్లో మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి రామాంజనేయులు వినతిపత్రం ఇచ్చారు. పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనాలని, సామూహిక కల్లాలు లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నందున వాటిని ఏర్పాటుచేయాలని, టార్పాలిన్లు సబ్సిడీపై ఇవ్వాలని, కేంద్రం గిట్టుబాటు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలని కోరారు.



కలెక్టరేట్‌లో అమలాపురంలోని దసరా ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమైన కలెక్టర్, ఎస్పీ

ప్రశాంతంగా చెడీ తాలింఖానా ఉత్సవాలను నిర్వహించాలి

: కలెక్టర్, ఎస్పీ

అమలాపురం,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా చారిత్రాత్మకంగా అమలాపురంలో నిర్వహించే చెడీ తాలింఖానా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా అధికారులు, ఉత్సవ కమిటీల పెద్దలు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావులు పిలుపునిచ్చారు. శుక్రవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో జిల్లా, డివిజన్ స్థాయి పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, దేవాదాయశాఖ అధికారులతోపాటు వివిధ ఉత్సవ కమిటీల పెద్దలతో దసరా ఉత్సవాల నిర్వహణ సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో చివరి ఘట్టం రోజున అమలాపురం పట్టణంలోని వివిధ వీధుల్లో ప్రాచీన సంప్రదాయాల్లో ఒకటైన చెడీ తాలింఖానా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. కర్రలు, కత్తుల వంటి మారణాయుధాలతో సాగించే ఈ సాహసోపేత విన్యాసాలు రాజరికపు వ్యవస్థలు, యుద్ధరంగాన్ని, వీరుల పోరాట ప్రతిమను తలపిస్తాయని, వీరత్వానికి, ఐకమత్యానికి క్రమశిక్షణగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. జమ్మిపూజ చేసి బేతాళ స్వామికి పూజలు నిర్వహించిన తరువాత సంప్రదాయబద్ధంగా చెడీ తాలింఖానా ఉత్సవాలు జరుపుతామని, వయసుతో తరతమ బేధం లేకుండా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు చెడీ తాలింఖానా విద్యలను సాహసోపేతంగా ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా అగ్గి బరాటాలు, కర్ర, కత్తిసాములతో పాటు కళ్లకు గంతలు కట్టుకుని, పొట్టల కూరగాయలు, కొబ్బరికాయలు పెట్టి వాటిని నరికే విన్యాసం ఇక్కడ విశేషం. పట్టణంలోని వివిధ వీధులకు సంబంధించి వాహనాలను ప్రదర్శిస్తారు. వాటిలో ఉత్సవ కమిటీలు ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. అయితే పట్టణంలోని అనేక వీధులు ఒకే రోజున జరిపే ఈ ఉత్సవానికి జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో భద్రత కల్పించడం, ఇక్కడ నియమించిన బందోబస్తు మధ్య ఉత్సవాల నిర్వహణ జరుగుతుందని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. ఇచ్చిన సమయాల ప్రకారం ఈ ఉత్సవాలను జరుపుకోవాలని ఎక్కడా ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఆయా వీధుల్లోని కమిటీ సభ్యులంతా ఐక్యమత్యంతో పనిచేసి విజయదశమి ఉత్సవాలను విజయవంతంగా ముగించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 26న మరోసారి పోలీసు అధికారులు, ఉత్సవ కమిటీ పెద్దలు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించడానికి నిర్ణయించారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సత్యనారాయణతోపాటు పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు సమీక్షలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి నియామకం

చైర్మన్‌గా కంచిపల్లి సత్యనారాయణ (అబ్బులు)


అబ్బులు

అమలాపురం,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని ప్రసిద్ధి చెందిన భూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గాన్ని నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జనసేనకు చెందిన కంచిపల్లి సత్యనారాయణ (అబ్బులు) చైర్మన్‌గా నియమితులు కానున్నారు. సభ్యులుగా దంగేటి విజయగౌరి, కొమ్మల ఆదిబాబు, డి.వెంకటసత్య జయలక్ష్మి, మట్టపర్తి గౌరీపార్వతి, వెన్నా మాణిక్యాంబ, మోకా కల్యాణిదుర్గమాణిక్యాంబ, కల్లేపల్లి ప్రసాద్, కుంచే అరుణకుమారి, పట్నాల వెంకటరమణమల్లికార్జునరావు, గోకరకొండ లక్ష్మణరావులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ట్రస్టుబోర్డు చైర్మన్‌గా జనసేనకు చెందిన కంచిపల్లి సత్యనారాయణ (అబ్బులు)ను ఎన్నుకోవడం ఇక లాంఛనమే.

బార్‌ల దరఖాస్తులకు గడువు పెంపు

అమలాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్‌ల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు గడువు పొడిగించారు. వాస్తవానికి ఈ నెల 14వ తేదీతో ముగియాల్సిన గడువును 17వ తేదీసాయంత్రం 6గంటల వరకు జిల్లాలోని బార్‌ల కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.రేణుక ప్రకటించారు. ఈ నెల 18న కలెక్టరేట్‌లో ఈ బార్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై డ్రా తీయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. పొడించిన గడువు దృష్ట్యా బార్ నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అడ్డంకులు తొలగేనా?

- కౌశిక డ్రైన్‌పై ఆక్రమణలకు మోక్షమేదీ
- పూడికతీత పనులు జరిగేనా
- రాజకీయ అడ్డంకుల మధ్య నలుగుతున్న అధికారులు
- ముంపు నీటి మళ్లింపుపై రైతుల గగ్గోలు


వ్యర్థాలు, తూడు, ఆక్రమణలతో కౌశిక డ్రైన్

కొత్తపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వందలాది ఎకరాల వరి రైతులకు ముంపునీరు మళ్లించే ఏకైక మార్గంగా ఉన్న కౌశిక నదిపై పుట్టగొడుగుల్లా ఆక్రమణలు గత కొన్నేళ్లుగా పుట్టుకొచ్చాయి. దీనికితోడు పూడికతీత పనులూ జరగడం లేదు. దీంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఇటీవలకాలంలో విపరీతంగా పెరిగిపోయిన ఆక్రమణలతో కౌశిక నదిలో వ్యర్థాలు పెరిగిపోయి తూడుతో పూర్తిగా మూసుకుపోయింది. దీంతో ముంపునీరు పోయేందుకు మార్గం లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. అయితే పూడిక తొలగించేందుకు ఆక్రమణలు అడ్డంకిగా మారడంతో కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పర్యవేక్షణలో ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. అప్పటి నుంచి అధికారులకు రాజకీయ ఒత్తిడులు మొదలయ్యాయి. కరమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్న చందంగా నాయకులు, ఆక్రమణదారుల మధ్య అధికారులు నలిగిపోతున్నారు. కౌశిక నదికి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడం వెనుక కొందరు ఆశ్రయం, ఉపాధి కోసం ఆక్రమిస్తే.. మరికొందరు వ్యాపార దృష్టితో అద్దె వసూళ్ల కోసం ఆక్రమించారు. దీంతో కౌశిక నది ఆక్రమణలతో బక్కచిక్కిపోయింది. పూడికతీత పనులకు ఉపయోగించే ఎక్స్‌కవేటర్ దిగేదారి లేకుండా పోవడంతో పనులు ఎలా చేపడతారని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాగా గత వైసీపీ ప్రభుత్వంలో పూడికతీత పనులకు నిధులు మంజూరైనా రాజకీయ లబ్ధికోసం ఆక్రమణదారులతో తలనొప్పి తెచ్చుకోవడం ఎందుకుని కాలయాపన చేయడంతో నిధులు మురిగిపోయాయి. ఇప్పుడు వర్షాకాలం కావడంతో రైతులు ముంపునీరు వెళ్లే మార్గం లేక గగ్గోలు పెడుతున్నారు. దీంతో జిల్లా కలెక్టర్ స్పందించి పూడికతీత పనులకు నిధులు మంజూరు చేశారు. పనులకు కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పర్యవేక్షణలో శ్రీకారం చుట్టగా మళ్లీ గత పరిస్థితి ఎదురైంది. ఏంచేయాలో అర్థంకాక అధికారులు అయోమయానికి గురవుతున్నారు. దీనిపై కలెక్టర్ చొరవచూపి రాజకీయ జోక్యం లేకుండా వందలాది ఎకరాల రైతులకు ఉపయోగపడేలా కౌశిక డ్రైన్ పూడికతీత పనులను సత్వరం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


కుటుంబ సభ్యుల వివరాలు

సంఖ్య	సభ్యుని పేరు	పుట్టిన తేది / వయస్సు	లింగం
02	గుత్తుల దేవి సత్య లక్ష్మీ ప్రసన్న	09-07-2005/20	ఆడ
03	గుత్తుల ఏడుకొండలు	01-01-1982/43	మగ
04	గుత్తుల లలిత శ్రావణి	09-05-2007/18	ఆడ

శాశ్వత చిరునామా : 3-24,చప్పిడి వారి పాలెం,అవిడి,కొత్తపేట,ఈస్ట్ గోదావరి,ఆంధ్ర ప్రదేశ్
తహసిల్దార్ కార్యాలయం: కొత్తపేట

తూర్పుగోదావరి జిల్లా పేరుతో ముద్రించిన స్మార్ట్ రేషన్‌కార్డు వెనుక భాగం

పాత జిల్లా పేరుతోనే స్మార్ట్ రేషన్‌కార్డులు

పి.గన్నవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్‌రేషన్‌కార్డులు చిరునామా విషయంలో కొన్ని ఉమ్మడి జిల్లా పేరుతోనే ముద్రితమయ్యాయి. కార్డు ముందు భాగంలో లబ్ధిదారుని ఫొటోతోపాటు పేరు, కార్డు నెంబరు, పుట్టిన తేదీ, దుకాణం గుర్తింపు నెంబరుతో కూడిన చిరునామా ఉన్నాయి. వెనుక భాగంలో కుటుంబంలో సభ్యులు పేర్లు, శాశ్వత చిరునామా ఉన్నాయి. ఈ క్రమంలో చిరునామా విషయంలో మండలం వరకు సరిగానే ముద్రించినప్పటికీ జిల్లా పేరు మాత్రం తూర్పుగోదావరి జిల్లాగా ముద్రించారు. నిజానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరుతో రావాల్సి ఉంది. ఈ విషయంపై ఒక అధికారిని వివరణ కోరగా ఆధార్‌కార్డుల ఆధారంగా డేటా ముద్రించినట్టు తెలిసిందని, జిల్లా అంతా ఇదే తరహాలో కార్డులు వచ్చాయని చెప్పారు. అయితే కొత్తగా ఆధార్ కార్డులు వచ్చినా జిల్లా పేరు మారలేనట్టు సమాచారం.


విద్యార్థిని రూపొందించిన ప్రాజెక్టు

శాస్త్రవేత్తల కృషి ఫలితంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నిరంతర పురోగతి సాధిస్తున్నాం. అంతే వేగంగా సమాజంలో పలు విభాగాల్లో కొత్తకొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. ఎప్పటికప్పుడు రూపం మార్చుకుంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో భవిష్యత్తు పరిణామాలను సైతం ముందుగానే ఊహించి వాటికి పరిష్కార మార్గాలు కనుగొనే అవకాశం పాఠశాల స్థాయి విద్యార్థులకు లభించింది.


పాఠశాల విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు

స్ఫూర్తిని నింపే ఆలోచనలకు ఆహ్వానం

- సమస్యలకు శాస్త్రీయ పరిష్కారం చూపించాలి
- ఇన్‌స్పైర్ నామినేషన్లకు ఈ నెల 15 వరకు అవకాశం

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను ప్రపంచం ముందు ఆవిష్కరించి వారిని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్) మనక్ (మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతిపాఠశాల నుంచి ప్రాజెక్టులను ఎంపిక చేసి వాటిలో ఉత్తమ ప్రాజెక్టులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఆ గురుతర బాధ్యతను జిల్లా విద్యా శాఖకు అప్పగించారు. ఆధునిక సమాజంలో స్ఫూర్తిని నింపి ప్రేరణ కలిగించే విధంగా సైన్స్‌లోని పలు అంశాలను ప్రాజెక్టుల రూపకల్పనకు జిల్లా విద్యా శాఖ ఇప్పటికే చర్యలు చేపట్టింది.

15 వరకు గడువు...

ఇన్‌స్పైర్-మనక్ ప్రాజెక్టుల కోసం ఆన్‌లైన్‌లో సెప్టెంబరు 15 వరకు గడువు ఉంది. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి కొంగొత్త ఆలోచనలతో ప్రాజెక్టులను రూపొందించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించే బాధ్యతను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. పాఠశాలల నుంచే ప్రాజెక్టుల వివరాలను నమోదు చేయవచ్చు. సమస్య, దానికి పరిష్కార మార్గం, ఉపయోగాన్ని కచ్చితంగా వివరించాలి. ప్రధానంగా స్థానిక సమస్యలకు సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధారితంగా పరిష్కారం చూపించాలి. పర్యావరణం, ఆరోగ్యం, శక్తి సంరక్షణ, వ్యవసాయం, వ్యర్థ పదార్థాల వినియోగం వంటి విభాగాల్లో కొత్త ఆలోచనలపై దృష్టి సారించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా కోరారు.



శాస్త్రీయ పరిష్కార మార్గాలు చూపాలి

గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా సైన్స్ అధికారి

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ అవార్డులు వేదికగా నిలిచాయి. విద్యార్థులు స్థానిక సమస్యలను గుర్తించి వాటికి శాస్త్రీయ పరిష్కార మార్గాలను చూపించే విధంగా ప్రాజెక్టులను రూపొందించాలి. అందుకు పాఠశాలల ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా కృషి చేయాలి. ఆధునిక సమాజంలో పర్యావరణంతో పాటు వ్యర్థ పదార్థాలతో ఎదురవుతున్న సమస్యలపై దృష్టిసారించి పరిష్కార మార్గాలు కనుగొనాలి. గతంలో ప్రతిభ కనబరిచిన ప్రాజెక్టులను ఎంచుకోవద్దు. విద్యార్థుల ఉత్తమ ఆలోచనలకు దేశవ్యాప్తంగా అవార్డుతో పాటు ప్రతి ప్రాజెక్టుకు రూ.10వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తారు. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచేలా ప్రాజెక్టుల రూపకల్పనకు కృషి చేయాలి.

ఖరీఫ్‌లో ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం!

- ఐదు జిల్లాల్లో 19.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ లక్ష్యం
- ఉదయం నుంచి రాత్రి వరకు వరుసగా సమీక్షలు నిర్వహించిన మంత్రి నాదెండ్ల

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం సేకరణపై ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమి హాలులో శుక్రవారం వరుసగా సమీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు సివిల్ సప్లయిస్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, సహకారశాఖ అధికారులు, రైస్‌మిల్లర్లు, రైతులు, పీఏసీఎస్ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ఎలా సమర్థంగా చేయాలో మంత్రి వివరించారు. కాకినాడ జిల్లా, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ఏ మేరకు ధాన్యం కొనుగోలు సేకరించాలో లక్ష్యం నిర్దేశించారు. మొత్తం ఐదు జిల్లాల్లో 19.50 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించారు.దీనిలో అత్యధికంగా పశ్చిమగోదావరి జిల్లాలో 5లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని నిర్దేశించారు. అలాగే తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో 4లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సేకరిస్తారు. కోనసీమ జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నులు, కాకినాడ జిల్లాలో 3లక్షల టన్నులుగా నిర్ణయించారు. ఐదు జిల్లాల్లో 1234 రైతు సేవా కేంద్రాల ద్వారా 691 రైస్‌మిల్లులను అనుసంధానం చేసి సేకరణ ప్రక్రియ చేయాలని నిర్ణయించారు. ఏలూరు జిల్లాలో 70శాతం ఈ-క్రాప్ పూర్తిచేశామని వ్యవసాయ అధికారులు వెల్లడించారు.ఈ జిల్లాలో జంగారెడ్డిగూడెం, నూజివీడు ప్రాంతాల్లో బీపీటీ 5204 రకం ఎక్కువగా సాగు చేశామన్నారు. మెట్ట ప్రాంతంలో ఎంటీయూ 1262, 1224 రకాలను సాగు చేశామన్నారు.సన్నబియ్యం రకాల్లో 50శాతం వరకు మార్కెట్లోకి అమ్మకాలకు వెళ్తుందన్నారు. పంటలకు సస్యరక్షణ చర్యలు పాటిస్తున్నందున మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న రాజానగరం, రాజమండ్రి రూరల్‌లో సన్న రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారని డీఎం గణేశ్‌కుమార్ వెల్లడించారు. ఈ జిల్లాలో ధాన్యం సేకరణకు 1.17 కోట్ల గోనె సంచుల వరకు అవసరం ఉందన్నారు. రైస్‌మిల్లర్ల వద్ద 81లక్షల గోనె సంచుల వరకు సిద్ధంగా ఉన్నాయన్నారు. తుఫాన్లు వస్తే పంటలను రక్షించుకోవడానికి రైతులకు టార్పాలిన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉంచామన్నారు. కాకినాడ జిల్లాలో 6.25లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేస్తున్నట్టు వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ వెల్లడించారు.దీనిలో 5.01 శాతం ఉత్పత్తి బహిరంగ మార్కెట్‌కు వెళ్లే అవకాశం ఉందన్నారు. డెల్టా పరిధిలో స్వర్ణ 1318, మెట్ట ప్రాంతంలో సాధన, సంపద స్వర్ణ వంటి రకాలు నాటారన్నారు. గత ఏడాది ఖరీఫ్ కంటే అధిక ఉత్పత్తులు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు.అనంతరం పౌరసరఫరాల సంస్థ ఎండీ మంజీర్ జిలానీ సామూన్ ధాన్యం సేకరణ ప్రక్రియ సమర్థంగా నిర్వహించేందుకు ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆన్‌లైన్ పోర్టల్ పని విధానాన్ని వివరించారు.కార్యక్రమంలో ఏపీ పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, కాకినాడ జేసీ రాహుల్‌మీనా, కోనసీమ జేసీ నిశాంతి, పశ్చిమగోదావరి జిల్లా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, కాకినాడ సివిల్ సప్లయిస్ డీఎం దేవుల నాయక్, కాకినాడ జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు రూ.వెయ్యి కోట్లు చెల్లించండి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

- ఉమ్మడి జిల్లాల సమీక్షలో మంత్రి నాదెండ్లను కోరిన రైస్‌మిల్లర్లు
- పీఏసీఎస్ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి
- పీఏసీఎస్‌లు ఆర్థిక పరిపుష్టికి సహకారం ఇవ్వాలి

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైస్‌మిల్లర్లకు బకాయిపడిన రూ.వెయ్యి కోట్లు ప్రభుత్వం తక్షణమే చెల్లించి ఆదుకోవాలని రైస్‌మిల్లర్లు ప్రతినిధులు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. కాకినాడ కలెక్టరేట్లో శుక్రవారం మధ్యాహ్నం రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్), రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు వల్లూరి సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ రైస్ మిల్లులకు వివిధ చార్జీల కింద చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలన్నారు. విదేశాలకు బియ్యం ఎగుమతులు ఆశించిన స్థాయిలో లేనందున ప్రభుత్వం ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని కోరారు. కాకినాడ జిల్లా ధాన్యం సేకరణ లక్ష్యం 3లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్దేశించారన్నారు. అయితే ఖరీఫ్‌లో 6 లక్షలకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తుంటే కేవలం 3లక్షల టన్నులను సేకరించడం తగదన్నారు. 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించే దిశగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఎంటీయూ రకాలతోపాటు బీపీటీ రకాలు, సన్నబియ్యాన్ని కూడా ప్రభుత్వ సేకరించాలని సూచించారు. కేరళకు ఆశించినస్థాయిలో ఎగుమతులు లేనందున రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువగా ధాన్యాన్ని సేకరించాలని తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ జిల్లా మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నాదెండ్లను కోరారు.త్వరలో రుణాలు తీసుకుని రూ.వెయ్యి కోట్లు బకాయిలు తీర్చుతామని మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. జిల్లాలో పీఏసీఎస్‌లలో రైతులు తీసుకున్న బకాయిలు పేరుకుపోయాయని వాటిని చెల్లించాలా చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ ప్రతినిధులు కోరారు. ఎడ్ల బండ్ల ద్వారా కూడా రవాణాకు అనుమతించాలని రైతు ప్రతినిధులు కోరారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసుకునే అవసరం లేకుండా సామూహిక కళ్లాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు పౌరసరఫరాల సంస్థకు పంపించాలని మంత్రి నాదెండ్ల కోరారు.

పెరుగుతున్న గోదావరి

3,46486 క్యూసెక్కులు దిగువకు..

ధవళేశ్వరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎగువున కురిసిన వర్షాలకు ఉప నది ప్రాణహిత ద్వారా వరద నీరు చేరుతుండడంతో గోదావరి పెరుగుతూ ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ ధవళేశ్వరం వద్ద గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ గేట్లను మరింత పైకి ఎత్తి 3,46486 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.దీంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం గణనీయంగా తగ్గి 8.60 అడుగులుగా నమోదయింది. ఇప్పటికే భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమం పెరుగుతూ శుక్రవారం సాయంత్రానికి 27.10 అడుగులకు చేరుకుంది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాలకు డెల్టా కాలువలకు 12,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 4200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2000క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6000వేల క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

కోరుకొండ నరసన్న పవిత్రోత్సవాలు


ఆలయ ముఖ మండపంలో స్వామివారికి అర్చన చేస్తున్న దృశ్యం

కోరుకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు స్వామివారి ఆలయ ముఖ మండపం అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.లోక కల్యాణార్థం చక్రవర్తుల సతీష్‌కుమార్ ఆచార్యులు, వాకాని మణికంఠాచార్యులు కైంకర్యంతో వంశపారంపర్య ధర్మకర్త ఎస్పీ రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలను వైకానస భగవత్ ఆగమన శాస్త్రం, శ్రీ వైష్ణవ భగవత్ ఆగమ శాస్త్రం, శ్రీ వైష్ణవ సాంప్రదాయాల ప్రకారం ద్రవిడ ప్రబంధం, ద్రవిడ ప్రబంధన, వేద పారాయన నిర్వహిస్తున్నారు. ఆగమ పండితులు పాణింగపల్లి సత్యపవన్‌కుమార్ ఆచార్యులు బృహ్మత్వంలో శుక్రవారం స్వామివారికి విశ్వక్సేణారాధన, అట్ట కలశస్నాపన, అభిషేకం, పవిత్రారోపణం, లక్ష్మీనరసింహ సుదర్శన మహా మంత్రయజ్ఞము, తులసి దళంతో స్వామి వారికి సహస్రనామార్చన విశేష నివేదన జరిగాయి.రాత్రి స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించి అనంతరం మహాశాంతి ప్రధాన హోమాలు నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. కార్యక్రమాలు స్వామి వారి అనువంశక అర్చక స్వాములు, పెదపాటి, పెద్దింటి, పెరవళి, వారి స్వీయ పర్యవేక్షణలో అనువంశక ధర్మకర్త శ్రీ పరాసర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్: పీడీజే సునీత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శనివారం(నేడు) నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కి 42 న్యాయ పీఠాలను(బెంచ్‌లు) ఏర్పాటు చేశామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అర్హమైన క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్ ప్రమాదాలు, బ్యాంకు, ప్రీ-లిటిగేషన్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

15న నన్నయ యూనివర్శిటీలో అద్విక-25


అద్విక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 15న అద్విక-25 సాంకేతిక ఉత్సవం నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టరును ఆమె శుక్రవారం ఆవిష్కరించారు. ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా దీనిని నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్‌లు, టెక్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, లఘుచిత్ర నిర్మాణం, స్కిల్ హౌస్ వంటి సాంకేతిక పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అద్విక వేదికపై బహుమతులు ప్రదానం చేయనున్నారు.

నూతన ఉప రాష్ట్రపతికి ఎంపీల శుభాకాంక్షలు



భారత నూతన ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీలోని ఆయన చాంబర్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు మర్యాదపూర్వకంగా కలిశారు. రాధాకృష్ణన్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లోక్‌సభ సభ్యుడు గంటి హరీష్‌మాధుర్‌తో పాటు కాకినాడ జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

అమలాపురం/సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

చిన్నారికేం తెలుసు... కలెక్టర్ అని!



ఈ చిన్నారి కాకినాడ జిల్లా సామర్లకోటలోని సిరి దివ్యాంగ పాఠశాలలో చదువుతోంది. మాటలు, నడక అంతగా రాకపోగా బుద్ధిమాంద్యంతో పాఠాలు నేర్చుకుంటోంది. శుక్రవారం పాఠశాల సందర్శనకు వచ్చిన కలెక్టర్ షాన్‌మోహన్‌కు తన చేతిని అందించి ఏదో మాట్లాడేందుకు ప్రయత్నించింది. దీంతో ఆయన వెంటనే స్పందించి తన చేతిని ఆ చిన్నారికి అందించడంతో నవ్వులు, కేరింతలతో ఆ చిన్నారి ఆనందపడింది. మిగిలిన దివ్యాంగ విద్యార్థులు సైతం నవ్వుల్లో మునిగారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

సామర్లకోట భీమేశ్వరుని సన్నిధిలో...



కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనిరధ మేడోజు లక్ష్మా శుక్రవారం రాత్రి విచ్చేశారు. న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక వాహనంలో వచ్చిన ఆమెకు ఆలయ పండితులు, దేవదాయ శాఖ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మా భీమేశ్వరస్వామికి, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నంది మండపం వద్ద పండితులు వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేశారు. జిల్లా మెడికల్ అధికారి విల్సన్, హెచ్ఏ శ్రీనివాసు, ఎంపీహెచ్ఏ మహారాజ్‌కుమార్, డీఈవో అడపా సూర్యప్రసాద్ (బాబీ) పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

భీమేశ్వరాలయంలో ఆదాయపన్ను శాఖ డీజీ పూజలు


భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న డీజీ రాజేశ్వర్ బైవర్

ద్రాక్షారామ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక భీమేశ్వరాలయాన్ని శుక్రవారం ఆదాయపన్నుశాఖ ఏపీ, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల డీజీ ఆనంగ్ రాజేశ్వర్ బైవర్ కుటుంబ సమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందుకున్నారు.

సోలార్ బ్యాటరీల చోరీకి యత్నం?

కిరాయి డబ్బుల చెల్లింపులో తేడా రావడంతో బయటపడ్డ వ్యవహారం

కూనవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండరెడ్ల ఇళ్లల్లో ప్రభుత్వం మంజూరు చేసిన సోలార్ లైట్లు బ్యాటరీలు గుట్టు చప్పుడు కాకుండా కొంతమంది వ్యక్తులు స్వాహా చేసేందుకు ప్రయత్నించారు. ఈ వ్యవహారంపై మూల్లూరు గ్రామస్థులకు అనుమానం రావడంతో వాటిని పట్టుకొని అదే గ్రామంలో ఓ రైతు ఇంట్లో వాటిని భద్రపరిచారు. వివరాల్లోకి వెళితే... కూనవరం మండలం కూటూరు గుట్టపై కారుమానుకొండ కోపిరిమెట్ట, గబ్బిలాల గొంది, వెలుగుల గొంది, తోటమామిడి గొంది, చింతగండి, పులుసుమామిడి గొంది, కళింగ మిద్దె తదితర గ్రామాల్లో కొండరెడ్లు నివసిస్తున్నారు. ప్రభుత్వం వీరికి సోలార్ లైట్లు మంజూరు చేసింది. అయితే వీటికి సంబంధించిన బ్యాటరీలు పాతవి అయ్యాయని వీటి స్థానంలో కొత్త బ్యాటరీలు అందిస్తామని కొంతమంది గుట్ట ఎక్కి ఆ గ్రామాలకు సంబంధించిన 120 బ్యాటరీలు గతంలో తీసుకెళ్లారు. మళ్లీ గురువారం ఓ వ్యక్తి ఫోన్ ద్వారా భద్రాచలంలో ఓ వాహనాన్ని రూ.3 వేలకు కిరాయికి మాట్లాడుకొని, తాను వాహనం వెంట రాకుండా ఆ వాహనాన్ని కూటూరు గుట్ట వద్దకు పంపాడు. అప్పటికే బ్యాటరీలు గుట్టపై నుంచి కిందకి దింపిన కొండరెడ్లు ఆ వాహనంలోకి ఎక్కించారు. అయితే వాహనాదారుడు తనకు కిరాయి డబ్బులు ఇవ్వాలని కిరాయి మాట్లాడుకున్న వ్యక్తికి ఫోన్ చేశాడు. అయితే రెండుమూడు గంటలైనా కిరాయి డబ్బులు చెల్లించకపోవడంతో వాహనదారుడు వాహనాన్ని అక్కడే నిలిపివేశాడు. వాహనం ఎక్కువసేపు అక్కడే నిలిచిపోవడంతో పక్క ఊరైన ముల్లూరు గ్రామస్థులకు అనుమానం వచ్చింది. ఇదేంటని ఈ బ్యాటరీలు ఎక్కడికి వెళ్తున్నాయని డ్రైవర్‌ను నిలదీయడంతో జరిగిన విషయం మొత్తం గ్రామస్థులకు తెలిపాడు. అయితే ఆ వ్యక్తి ఫోన్ నెంబరు డ్రైవర్ దగ్గర తీసుకొని గ్రామస్థులు ఎన్నిసార్లు ప్రయత్నించినా అతని దగ్గర నుంచి సమాధానం రాకపోవడంతో తమను మోసం చేస్తున్నారని కొండరెడ్లు సైతం మేల్కొని ఆ వాహనం వెళ్లకుండా అడ్డుకున్నారు. వాహనంలో ఉన్న 48 బ్యాటరీలను గ్రామంలోని కన్నారావు అనే రైతు ఇంట్లో ఉంచారు. కన్నారావు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దీని వెనుక ఎవరున్నారని కోణంలో ఎస్ఐ లతాశ్రీ దర్యాప్తు చేస్తున్నారు.

ముంపు లెక్క మార్పు



ఇటీవల వరదలు సంభవించినప్పుడు ముంపులో కూనవరం (ఫైల్)

- విలీన మండలాల్లో రోజుల తరబడి వరద ఉధృతి
- పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం
- రాకపోకలకు అంతరాయం
- గ్రామస్తుల్లో వీడని భయం

చింతూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా వరదలు రావడం సహజమే. లోతట్టు వాసులు అవస్థలు పడడమూ మామూలే. కాగా ఇటీవల పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో ముంపు లెక్క గతంతో పోల్చితే పెరిగింది. దీంతో విలీన మండలాల్లో ముంపు లెక్క మారింది. రో జుల తరబడి లోతట్టు గ్రామాల్ని వరద నీరు చుట్టుముట్టి ఉంటోంది. ఈ క్రమంలో తాజాగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో 2 దఫాలుగా 28 రోజు ల పాటు విలీన మండలాల్లో రాకపోకలు నిలిచి పోయాయి. భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృ తి 43 అడుగులు చేరుకుంటే మొదటి ప్రమాద హెచ్చరిక, 48 అడుగులకు చేరుకుంటే రెండో ప్రమాద హెచ్చరిక, ఇక 53 అడుగులకు చేరు కుంటే మూడో ప్రమాద హెచ్చరికగా ప్రకటించ డం జరుగుతుంది. అదే సమయంలో గోదావరి పెరుగుదలతో పాటు విలీన మండలాలకు ఎగు వనున్న ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసిన పక్షంలో శబరి, గోదావరి నదులు ఉధృతి కూడా పెరిగి చింతూరు, కూన వరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలా ల్లో ఆ ప్రభావం పడుతుంది. దీంతో విలీన మండలాల్లోని లోతట్టు ప్రాంతాలతో సహా ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాలకు కూడా రాకపోకలు నిలిచిపో తుంటాయి. దశాబ్దాలుగా ఈ స్థితి అనుభవమే.

తాజాగా 14 లక్షల క్యూసెక్కుల రికార్డు..!

తాజాగా వరద కూడా సాధారణ స్థాయికి చింతూరు వద్ద చేరుకోవడానికి 28 రోజులు పట్టింది. ఈ ఏడాది ఆగస్టు 21న భద్రాచలం వద్ద 51.9 అడుగులు మేర గోదావరి ప్రవహించగా అదేరోజు అధికారులు వేసిన అంచనాకు మించి 4 అడుగుల ఉధృతి ఎక్కువగా ప్రవహిం చినట్టు గుర్తించారు. అదే సమయంలో భద్రాచలంకు 11. 50 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఎగువ నుంచి చేరగా బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలం వద్ద 14 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఉధృతి రికార్డు అయినట్టు అధికారిక గణాంకాలు తేల్చి చెప్పాయి. దీనికి కారణం పోలవరం బ్యాక్ వాట రేనని అధికారులు స్పష్టం చేశారు. మొత్తం మీద పోలవరం బ్యాక్ వాటర్‌తో విలీన మండలా ల్లోని లోతట్టు గ్రామస్థులు వర్షాకాలంలో భయం భయంగా నిద్రలేని రాత్రులు గడపాల్సిన స్థితి ఉంది.

గణాంకాలు ఇలా...

కాగా పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం లేని కాలంలో శబరి, సీలేరు వరద ఉధృతి ఎంత వేగంగా పెరిగేదో అంతే వేగంతో వరద ఉధృతి తగ్గేది కూడా. అదేదశలో భద్రాచలంలో గోదావరి నీటి మట్ట 2 అడుగులు తగ్గితే చింతూరు వద్ద శబరి నీటి మట్టం 5 అడుగులు మేర తగ్గేది. కాగా ఇప్పుడా పరిస్థితి కానరావడం లేదు. భద్రాచలంలో గోదావరి ఉధృతి ఒక అడుగు తగ్గినా శబరి నీటి మట్టం మాత్రం నిలకడగానే ఉంటోంది. దీనికి కారణం కూనవరం వద్ద ఎగపోటునిచ్చిన పోలవరం బ్యాక్ వాటర్ దిగువకు వరదను వేగంగా పోనీకుండా అడ్డుకోవడమే. 2022 నుంచి ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. 1986 ఆగస్టు 16న భద్రాచలం వద్ద గరిష్ఠంగా 75.6 అడుగుల మేర వరద ఉధృతి నమోదైంది. నాడు భద్రాచలం వద్ద 27.02 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించినట్టు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఆ సందర్భంలో గోదావరికి తోడుగా శబరి, సీలేరు నదులు కూడా ఉధృతంగా ప్రవహించడంతో మూడు నదుల ఉధృతి ఏకమై విలీన మండలాలు పెద్ద ఎత్తున ముంపునకు గురయ్యాయి. 2022 జూలై 16న భద్రాచలం వద్ద 71, 03 అడుగుల ప్రవాహంతో 24.43 లక్షల క్యూసెక్కులు వరద నమోదైంది. ఆ సమయంలో శబరి, సీలేరు నదుల ఉధృతి అంతగాలేనప్పటికి కేవలం గోదావరి వదర ఉధృతి పెరిగి తద్వారా పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో విలీన మండలాల్లో ముంపు చూస్తూచూస్తూనే పెరిగిపోయింది. అంతేకాదు బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలం వద్ద నీటిమట్టం సాధారణ స్థాయి (30 అడుగులు)కి చేరుకోనేందుకు దాదాపు రెండు నెలలు పట్టింది.

ప్రసాద్ స్కీం పనులు పూర్తి చేస్తాం

- టూరిజంశాఖ చీఫ్ ఇంజనీరు వెంకటేశ్వరరావు
- అన్నవరంలో అన్నదాన భవన నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

అన్నవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రసాద్ స్కీం ద్వారా చేపడుతున్న సుమారు రూ.19.32 కోట్లు విలువైన పనులు వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని టూరిజంశాఖ చీఫ్ ఇంజనీరు వెంకటేశ్వరరావు తెలిపారు.శుక్రవారం కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో అన్నదాన భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీపడేదిలేదని స్పష్టం చేశారు. ఈ నిర్మాణాలు పూర్తి అయితే భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టూరిజం శాఖ ఈఈ భాస్కరరావు, దేవస్థానం ఈఈ వి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా చండీహోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం రత్నగిరి క్షేత్రరక్షకి అయిన వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితుల గణపతి పూజ, పుణ్యాహావచనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పారాయణలు, జపములు శాస్త్రోక్తంగా జరిగాయి. 11గంటలకు హోమ పూర్ణాహుతి జరిగింది. ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

రంప ఐటీడీఏ పీవోగా స్మరణ్ రాజ్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన స్మరణ్ రాజ్

రంపచోడవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రంపచోడవరం ఐటీడీఏ పీఏ స్మరణ్ రాజ్ అన్నారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడుతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపడతామన్నారు. ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పీహెచ్‌వో దేవదానం, జీసీసీ డీఎం జయశ్రీ, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, డీడీ కార్యాలయ సూపరింటెండెంట్ బీ.కిషోర్, ఈఈ ఐ.శ్రీనివాసరావు, డీఎల్‌డీవో కె.కోటేశ్వరావు, ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరావు, వైస్ ఎంపీపీ కె.బాలకృష్ణ, ఎం పీటీసీలు తుర్రం వెంకటేశ్వరావు, కుంజం వంశీ, ఉలవల లక్ష్మి, తహశీల్దార్లు తదితరులు ఐటీడీఏ పీవోను మర్యాదపూర్వకంగా కలిశారు.

'అరటి నార ఉత్పత్తులతో ఆర్థిక భరోసా'



కొవ్వూరు అరటి పరిశోధనా కేంద్రంలో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మహిళలు

కొవ్వూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అరటినార ఉత్పత్తుల తయారీ ద్వారా మహిళలు ఆర్థిక భరోసా సాధించవచ్చని కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రం సంచాలకుడు డా.వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు అరటి పరిశోధనా కేంద్రంలో నాబార్డు ఆర్థిక సహకారంతో మహిళలకు అరటి బొందెల ద్వారా నార, ఇతర ఉత్పత్తుల తయారీపై శిక్షణ నిర్వహించారు. సీనియర్ శాస్త్రవేత్త డా.కె.రవీంద్రకుమార్ మాట్లాడుతూ నవంబరులో 25 రోజుల పాటు జరిగే అరటి బొందెల నుంచి నార, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణలో పాల్గొనడానికి ఆసక్తి కలిగిన మహిళలు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. డా.వెంకటస్వామి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాబార్డు డీడీఎం చక్రధర్ మాట్లాడుతూ శిక్షణ ద్వారా మహిళలు మరింత ఆర్థిక సంమృద్ధిని సాధించవచ్చన్నారు. శిక్షణలో పాల్గొనే మహిళలు ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డా.రవీంద్రకుమార్ 9491838982లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి సుధీర్, ఎన్‌జీవో ప్రసాద్, శాస్త్రవేత్తలు డా.పి.లలిత కామేశ్వరి, డా.కె.మమత, డా.ఏ.స్నేహలతరాణి, డా.వై.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ తగిలి ఐదు గేదెల మృతి



బూరుగుపూడి గ్రామంలో మృతిచెందిన గేదెలు

కోరుకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలో తోటల మధ్య నుంచి వెళ్లిన 11కేవీ విద్యుత్ వైరు తెగి పడడంతో ఆ పరిసరాల్లో మేత మేస్తున్న గ్రామానికి చెందిన నక్కా శ్రీనుకు చెందిన 5 గేదెలు గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు గేదెలు మృతి చెందడాన్ని చూసి బోరున విలపించాడు. విషయం గ్రామంలోని రైతులకు తెలియడంతో వారు విద్యుత్ శాఖ అధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులకు తెలియజేశారు. వెంటనే 5 గేదెలకు పోస్టుమార్టం నిర్వహించారు. చట్టప్రకారం రైతుకు రావాల్సిన నష్టపరిహారాన్ని అందించే ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు కంటే నాగ కేశవరావు, జనసేన నాయకుడు అడపా శ్రీనివాస్ సంఘటనా స్థలానికి వెళ్లి రైతును ఓదార్చారు.

కేజ్ కల్చర్‌కు ఏలేరు ప్రాజెక్టు

ప్రభుత్వం ఉత్తర్వులు



ఏలేశ్వరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేజ్ కల్చర్ (చేప పిల్లలను బాక్సుల్లో పెం చడం)కు కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయాన్ని విశాఖపట్నంలోని మిస్సర్స్ ఫిషన్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా మద్దువలస రిజర్వాయర్‌తో పాటు కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఏలేరు ప్రాజెక్టులలో పై కంపెనీ చేపల పెంపకాన్ని చేసుకునేందుకు కంపెనీకి అనుమతి లభించింది. ప్రారంభంలో ఆర్థికంగా పెట్టుబడి పెట్టేందుకు ప్రయివేటు లిమిటెడ్ సంస్థ అంగీకారం తెలిపినట్టు ఉత్త ర్వుల్లో ప్రభుత్వం వెల్లడించింది. దశలవారీగా చేపల పెంపకంపై మత్స్యకారులకు శిక్షణ, ఉపాధి కల్పించేందుకు లిమిటెడ్ కంపెనీ ముందుకు వచ్చింది. సదరు కంపెనీకి మందస్తు అనుభవం ఉండడంతో ఎంపికలో ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలుస్తోంది.



ఏలేరులోకి చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

చేప పిల్లల విడుదల

ఏలేశ్వరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏలేరు జలాశయంలో ప్రభుత్వం సమకూర్చిన పదివేల చేప పిల్లలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలపై వాహనాలు, పరికరాలు అందిస్తున్నాయన్నారు. ఏలేరు జలాశయంలో చేపల పెంపకం ద్వారా పరిసర ప్రాంతాల్లో మత్స్యకారులకు ఉపాధి పెరుగుతుందన్నారు. ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు, ఎంపీడీవో సూర్యనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొది రెడ్డి గోపి, మూది నారాయణస్వామి పాల్గొన్నారు.

టేకులబోరులో కొండచిలువ హల్‌చల్

- పట్టుకునేందుకు అటవీ శాఖ సిబ్బంది ప్రయత్నం
- దొరకకపోవడంతో గ్రామస్తుల్లో భయం



కూనవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలం టేకులబోరు గ్రామంలో కొండచిలువ హల్ చల్ చేసింది. గురువారం రాత్రి గ్రామంలోని పాదం ఆనంద్ ఇంటి ఆవరణలోకి కొండచిలువ వచ్చింది. దీంతో గ్రామస్తులందరూ అక్కడికి చేరుకున్నారు. కొండచిలువ సుమారు 15 అడుగుల పొడవుతో పాటు లావుగా కనిపించడంతో గ్రామస్తులు భయంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొంతమంది అటవీ సిబ్బంది దానిని కర్రలతో పట్టుకునే ప్రయత్నం చేశారు. సుమారు అరగంట పాటు అది చిక్కనట్టే చిక్కి తప్పించుకుని పోయింది. శుక్రవారం ఉదయం సుమారు పదిమందికి పైగా సిబ్బంది అక్కడికి చేరుకుని దానిని వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. కొండచిలువ ఇంకా దొరకకపోవడంతో మళ్లీ ఎక్కడ వస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు.

బాలికపై అత్యాచారం.. ఇద్దరిపై పోక్సో కేసు

గోకవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడు, బాలుడిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన గునుపే కిరణ్‌కుమార్, మరో బాలుడు కలిసి ఓ బాలికను మాయ మాటలతో ఆకర్షించి అత్యాచారానికి పాల్పడినట్టు బాధితురాలి కుటుంబసభ్యుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామన్నారు. అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బాలికను మోసగించిన యువకుడిపై..

కొవ్వూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణానికి చెందిన 10వ తరగతి చదువుతున్న మైనర్ బాలికను అదే ప్రాంతానికి చెందిన యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్టు బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

అల్లవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఓ గ్రామంలో 16 ఏళ్ల మైనరు బాలిక ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు. 5రోజుల కిందట పురుగుల మందు తాగిన బాలికను తక్షణం మెరుగైన వైద్యసాయం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారన్నారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ బాలిక మృతిచెందిందని ఎస్‌ఐ చెప్పారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బస్సులో 600 గ్రాముల బంగారు వస్తువుల మాయం

గండేపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి బంగారు వస్తువులను పోగొట్టుకున్నాడు. దీనికి సంబంధించి గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన అంబూరి మునిరాజు నెల్లూరు శ్రీ గోల్డ్ జువెలరీ షాపులో పనిచేస్తున్నాడు. తరచూ అతడి యాజమాని చెప్పిన ప్రకారం విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లో గోల్డ్ షాపులకు బంగారు వస్తువులు పట్టుకుని వెళ్తుంటాడు. అదేవిధంగా 2 రోజుల క్రితం నెల్లూరి నుంచి 1200 గ్రాముల బంగారు వస్తువులు పట్టుకుని వచ్చి విజయనగరం, వైజాగ్‌లో సుమారు 600 గ్రాముల గోల్డ్ వస్తువులు షాపులకు ఇచ్చాడు. మిగిలిన 600 గ్రాముల గోల్డ్ వస్తువులతో ఈనెల 10న నెల్లూరు వస్తుండగా కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరు హనీ దాబా వదకు వచ్చేసరికి బస్సు డ్రైవర్ రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో భోజనం నిమిత్తం ఆపాడు. మునిరాజు బస్సు దిగి భోజనం చేసి మళ్లీ తిరిగి చూసుకునేసరికి తన బ్యాగు, అందులో ఉన్న 600 గ్రాముల బంగారు వస్తువులు (చెవి దిద్దులు, గాజులు) కనిపించకుండా పోయాయి. దీనిపై అతడు గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎల్‌ఎన్‌పురంలో బంగారం, వెండి వస్తువుల చోరీ

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎల్‌ఎన్‌పురంలో బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయ్యాయి. గ్రామానికి చెందిన గంపా నిర్మల కాకినాడలోని బంధువుల ఇంటికి వెళ్లి గురువారం రాత్రి తిరిగి వచ్చింది. ఇంటి లోపలికి వెళ్లి చూసుకునేసరికి బీరువా తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి పరిశీలించగా బీరువాలో ఉంచిన 13 కాసుల బంగారం నగలు, 19 తులాల వెండి, సుమారు రూ.2లక్షల వరకూ నగదు చోరీకి గురైనట్టు గుర్తించింది. పిఠాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఇంటిని పరిశీలించి ఆధారాలు సేకరించారు.

మండపేటలో... నేటి నుంచి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు

మండపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఈనెల 13,14 తేదీల్లో 49వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలను జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహిస్తామని టెన్నికాయిట్ అసోషియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు అప్పసాని కృష్ణకుమారి తెలిపారు. పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 200 జట్లు హాజరవుతున్నాయని రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ రిఫరీ కుంచే రమేష్ తెలిపారు. వారిలో 100 మంది బాలురు, 100 మంది బాలికలు పాల్గొంటారని చెప్పారు. పట్టణంలోని అన్నపూర్ణ హైస్కుల్లో బాలికలకు.. ప్రభుత్వ హైస్కుల్లో బాలురకు వసతి కల్పించామన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 12మంది రిఫరీలు హాజరవుతున్నారన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

కొవ్వూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన మేకల వీర్రాజు(60) కొంతకాలంగా కొవ్వూరు పట్టణం టాక్సీస్టాండ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 6న వీర్రాజు సైకిల్‌పై కామరాజుపేట వెళ్లి 7న తిరిగి వస్తుండగా గామన్‌బ్రిడ్జిపై 46 స్తంభం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. వీర్రాజు తలకు తీవ్ర రక్తగాయాం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లి పోయాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది వీర్రాజును కొవ్వూరు, అనంతరం రాజమహేంద్రవరం తరలించారు. చికిత్స పొందుతూ వీర్రాజు గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యంపై కేసు

గొల్లప్రోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుమారుడితో కలిసి తల్లి అదృశ్యంపై గొల్లప్రోలు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రస్తుతం నివాసముంటున్న నక్కా సింహాచలం గతంలో సామర్లకోటలో కుటుంబసభ్యులతో కలిసి ఉండేంది. వారితో విభేదాలు రావడంతో దుర్గాడలో భర్తతో కలిసి నివాసముంటోంది. ఈనెల 10వ తేదీ ఉదయం 10.30 గంటల సమయంలో తన కుమారుడు నక్కా చైతన్య (3)ను తీసుకుని ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మేనమామ శివకోటి నూకరాజు శుక్రవారం గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

మద్యం మత్తులో...

- బైక్‌ను ఢీకొన్న కారు
- భార్యాభర్తలకు తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట శివారు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే జగ్గంపేట మండలంలోని మన్యవారిపాలెం గ్రామానికి చెందిన పోట్రు శ్రీను (39), పోట్రు వీర అశ్వినీ (29) భార్యభర్తలు. గురువారం ఉదయం రాజమండ్రి ఆసుపత్రికి ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై పయనమై జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాహనం ఉంచారు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దిగి అక్కడ ఉంచిన బైక్‌పై తిరిగి మన్యం వారి పాలెం బయలుదేరారు. గోకవరం రోడ్డులో బ్రాందీ షాపు వద్దకు వచ్చేసరికి జగ్గంపేట వైపు వెళ్తున్న కారు బైక్‌పై ఎడమవైపు వెళ్తున్న ఆ దంపతులను ఢీకొని పక్క నున్న తాడిచెట్టుకు గుద్దుకుని ఆగింది. బైక్‌పై వెళ్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే రాజమండ్రిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోట్రు శ్రీను కాలు నుజ్జునుజ్జు అయ్యింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడమే కాకుండా మద్యం మత్తులో ఉన్నట్టు ఎస్‌ఐ రఘునాథరావు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



సుంకటరేవు వద్ద ప్రమాద దృశ్యం

తాళ్లరేవు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ పరిధి సుంకటరేవు 216 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైనట్టు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. తాళ్లరేవు నుంచి రొయ్యల లోడుతో బొలెరా వ్యాన్ యానాం వైపునకు వెళ్తుండగా సుంకటరేవు వద్ద సుంకరపాలెం నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న నాగాబత్తుల షడ్రాక్‌ను ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయమై అపస్మారకస్థితి చేరుకున్నాడు. కోరింగ పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు. ఎస్‌ఐ పి.సత్యనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, ఎక్స్‌కవేటర్ల సీజ్

రౌతులపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎస్.పైడిపాల గ్రామం తాలొద్దులో ఈసీ అనుమతి లేని క్వారీలో లారీ, ఎక్స్‌కవేటర్లను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. మైనింగ్ అధికారులు సత్యతేజ, రవీంద్ర శుక్రవారం దాడులు నిర్వహించి అనుమతులు లేని క్వారీలో ఒక లారీ, 2 ఎక్స్‌కవేటర్లను సీజ్ చేశారు.



సీజ్ చేసిన లారీ, ఎక్స్‌కవేటర్

సచివాలయ ఉద్యోగుల నిరసన

మామిడికుదురు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): డోర్ టూ డోర్ సర్వేను వ్యతిరేకిస్తూ సచివాలయ ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వాట్సాప్ గవర్నర్ డోర్‌టూడోర్ సర్వేకు వ్యతిరేకమన్నారు. సచివాలయాల్లోనే ఉండి వాట్సాప్ సేవలను పెంపొందించేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు.

వ్యాసరచన పోటీలు

యానాం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): యానాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హిందీ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హిందీలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



పి.గన్నవరం: స్మార్ట్ రేషన్‌కార్డులను అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

- ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు
- స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

ముమ్మిడివరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీలో అవకతవకలను నిరోధించి వాస్తవ లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులను సక్రమంగా చేరవేసేందుకే స్మార్ట్ రేషన్‌కార్డు విధానం అమలులోకి తీసుకువచ్చామని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ బాలయోగి తపో ఆశ్రమ 13వ రేషన్‌షాపు దుకాణంలో శుక్రవారం స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా దొమ్మేటి రమణకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, అర్థాని శ్రీనివాసరావు, పొద్దోకు నారాయణరావు, ములపర్తి బాలకృష్ణ, కట్టా సత్తిబాబు, పిల్లి నాగరాజు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, లోకినీడి వెంకటేశ్వరరావు, సానబోయిన సోమయ్య, ఎస్ఎంఎస్ ప్రసాద్, నిమ్మకాయల విస్సు, జనిపల్లి సత్యనారాయణ, కటికదల నాని, చింతలపూడి కొండాబాబు, మెండి కమల, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, ఆర్ఐ మదన్‌మోహన్, డీలర్లసంఘ అధ్యక్షుడు గుద్దటి సుబ్బారావు పాల్గొన్నారు.

అవినీతికి తావు లేకుండా..

మామిడికుదురు,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో అవినీతికి తావులేకుండా స్మార్ట్ రేషన్‌కార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారంమగటపల్లిలో స్మార్ట్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బొలిశెట్టి జగదీష్‌కుమార్, సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, నామన నాగేశ్వరరావు, బొలిశెట్టి జయరామ్, గోగి గోపి, కలిగితి పల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు చెక్ పెట్టేందుకే..

ఐ.పోలవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు చెక్ పెట్టేందుకే ప్రభుత్వం స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఐ.పోలవరంలో శుక్రవారం ఆయన స్మార్ట్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఐ.పోలవరంలో కొందరికి ఆయన కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, కాకర్లపూడి రాజేష్, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి బుజ్జి, రాయపురెడ్డి స్వామినాయుడు, మద్దిరెడ్డి కుమార్, బొంతు ప్రసాద్, దేవ రాంబాబు, చోడిశెట్టి వీరబాబు, రాయపురెడ్డి సూరిబాబు, లక్కింశెట్టి ప్రకాష్, రాయపురెడ్డి బ్రహ్మానందం, దంగుడుబియ్యం మోహన్, మల్లిపూడి రాజు, సాగిరాజు సాయివర్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్‌కార్డుల పంపిణీ

కాట్రేనికోన, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డులు ప్రవేశపెట్టినట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. శుక్రవారం మండలంలో ఆయన స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. మండలంలో 23,549 స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలు అరికట్టేందుకే..

పి.గన్నవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో అవకతవకలను అరికట్టేందుకే కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. కె.ఏనుగుపల్లిలో స్మార్ట్‌రేషన్‌కార్డుల పంపిణీని తహశీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. నియోజకవర్గంలో 78,096 స్మార్ట్‌రేషన్ కార్డులు ప్రజలకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సర్పంచ్ తోలేటి బంగారు నాయుడు, ఎంపీ టీసీ కొల్లే సూర్యనారాయణ, బొరుసు సత్యనారాయణ, శేరు శ్రీను బాబు, తోలేటి సత్తిబాబు, డీలర్లసంఘ అధ్యక్షుడు యన్నాబత్తుల తాతాజీ, డీలర్లు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ఆటో కార్మికుల ధర్నా

అమలాపురం టౌన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్ర ఆటోవాలా యూనియన్ జిల్లాశాఖ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమం విజయవంతమైంది. ఉన్నత చదువులు చదువుకున్నవారు ఉద్యోగాలు లేక ఆటో కార్మికులుగా జీవనోపాధి పొందుతున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో ఆటో కార్మికుల జీవనోపాధిని దెబ్బతీశారని నాయకులు విమర్శించారు. 24గంటల పాటు నిరాహార దీక్షచేపట్టాలనే నిర్ణయాన్ని వాయిదా వేసినట్టు ప్రకటించారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఏడాదికి రూ.15వేలు చొప్పున చెల్లిస్తామని ప్రకటించడంతో దీక్షను వాయిదే వేశామన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుకు 11డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కోశాధికారి మోకా శ్రీను, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బొక్కా నాని, బొక్కా మంగరాజు, బొమ్మి ఫణీంద్ర పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దుచేయాలి

అంతర్వేది, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కంట్రిబ్యూటరీ పెన్షన్ సిస్టమ్ (సీపీఎస్)ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఆలస్యం చేయకుండా పాతపెన్షన్ వర్తింప చేయాలని పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అంతర్వేదిపాలెం, టేకిశెట్టిపాలెం, వీవీ మెరక, మోరి ఉన్నత పాఠశాలల్లో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

'సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలందిస్తా'

మామిడికుదురు, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి):సొసైటీలద్వారా రైతులకుమెరుగైన సేవలందిస్తామని మామిడికుదురు సొసైటీ త్రిమెన్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన ఈలి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మామిడికుదురు, పాశర్లపూడి, పాశర్లపూడిలంక సొసైటీలకు త్రిమెన్ కమిటీలను నియమించారు. మామిడికుదురు త్రిమెన్ కమిటీ చైర్మన్‌గా ఈలి శ్రీనివాస్, సభ్యులుగా కాకి శ్రీనివాస్, మట్టా సత్తిబాబు, పాశర్లపూడి సొసైటీకి చైర్మన్‌గా మందా గాంధీ, సభ్యులుగా యర్రంశెట్టి దుర్గారాజేశ్వరి, బొంతు మహాలక్ష్మీనాగకుమారిలను పాశర్లపూడిలంక చైర్మన్‌గా అప్పన వీరబాబు, సభ్యులుగా కుడుపూడి వెంకటేశ్వరరావు, ఇంజేటి నాగేశ్వరరావులను నియమించారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

అందుబాటులో ఉండని మత్తు డాక్టర్
మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన

పి.గన్నవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీహెచ్‌సీలో మత్తువైద్యుడు అందుబాటులో ఉండటం లేదని, రాత్రి సమయంలో కాన్పు నకు వస్తున్న గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబులు మండల సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు వైద్యురాలిపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ శనివారం ఫిర్యాదులపై ఆసుపత్రిలో విచారణ చేపడతామన్నారు. వైద్య శాఖ కమిషనర్‌తో మాట్లాడి మత్తు వైద్యురాలి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల్లో లోహోల్టేజ్ సమస్య పరిష్కారం కాలేదని వాడ్రేవుపల్లి గ్రామసర్పంచ్ పత్తిపాటి ఉమామహేశ్వరి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ లోహోల్టేజ్ సమస్య ఎందుకు పరిష్కరించలేకపోతున్నారని విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించారు. దీనిపై రాజోలు డిప్యూటీ డీఈఈ బీవీ కృష్ణరాజా మీగ్రామాల్లో లోహోల్టేజ్ సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు అందిస్తే, దశలు వారీగా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ఇంచార్జ్ ఎంపీడీవో జి.ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, నాటక రంగ అకాడమీ డైరెక్టర్ చెల్లిబోయిన గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

రూ.16.60 లక్షల సీఎం సహాయ నిధి పంపిణీ

కాట్రేనికోన, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని 35మంది లబ్ధిదారులకు రూ.16.60లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శుక్రవారం పంపిణీ చేశారు. కాట్రేనికోనలో రూ.52లక్షలతో నిర్మించనున్న అన్నక్యాంటీన్ భవనానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు మరిన్ని సేవలు

అంబాజీపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందిస్తానని చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో ఆయన అధ్యక్షతన శుక్రవారం పాలకవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీ హరీష్‌మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణల సహకారంతో మార్కెట్ కమిటీ పరిధిలోని లింక్ రోడ్ల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఈసందర్భంగా మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని వర్తకులు పాలకవర్గాన్ని కోరారు. సీసీ కెమెరాలు లేక యార్డులో పెట్టుకున్న అరటిగెలలు దొంగతనం జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, ఏఎంసీ కార్యదర్శి ఐ.రమేష్, ఇన్‌చార్జ్ ఏడీఏ సీహెచ్ విజయకుమార్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శెట్టిబలిజగా కుల ధ్రువీకరణపై హర్షం

అల్లవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శెట్టిబలిజ సామాజికవర్గాన్ని బీసీ బి-4గా గుర్తిస్తూ జీవో విడుదల చేయడంపై శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అల్లవరంలో నీటి సంఘం అధ్యక్షుడు బొక్కా నాగశివప్రసాద్ స్వగృహం వద్ద విలేకరులతో మాట్లాడారు. కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల ద్వారా శెట్టిబలిజలకు న్యాయం జరిగిందని, ప్రభుత్వ జీవో ప్రతులను చూపించారు. సమావేశంలో చొల్లంగి వెంకటరమణ, మొల్లేటి నాగమల్లేశ్వరదేవరాయులు, బీసీసెల్ మండలాధ్యక్షుడు రాయుడు రాంబాబు, వాసర్ల అప్పారావు, కడలి రామసత్యనారాయణ, కుడుపూడి నాగేశ్వరరావు, వాసర్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు అండగా ప్రభుత్వం

రాజోలు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ కులస్థులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. రాజోలులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 2023 ఫిబ్రవరి 23న జీవో విడుదల చేసి గీత కులాలన్నీ కలిపి గౌడుగా మార్చేశారని ఆవేదన చెందారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు మంత్రి వాసంశెట్టి సుభాష్ వాస్తవాలు తెలియజేయడంతో ఈనెల11న గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవరిస్తూ కుల ధ్రువపత్రంలో శెట్టిబలిజ కులం వచ్చేలా కొత్త జీవోను విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గుబ్బల ఫణికుమార్, రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, ఎంపీపీ కడలి శ్రీదుర్గ, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, చెల్లింగి అబ్బులు, కాకి లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ పిల్లి శ్రీరామమూర్తి, పొదలాడ, విశ్వేశ్వరాయపురం సర్పంచ్‌లు కడలి సత్యనారాయణ, చెల్లుబోయిన హెలీన, మామిడికుదురు మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల హర్షం

పి.గన్నవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో గౌడ, ఈడిగ, గౌడ, కళాసీ, శెట్టిబలిజ, శ్రీనయినా ఉపకులాలకు ముందు గౌడ అని పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు 2023లో జీవో విడుదల చేశారని శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు తెలిపారు. శెట్టిబలిజ ఉపకులాల ముందు గౌడను తొలగిస్తూ ప్రభుత్వం ఈనెల11న జీవో జారీచేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పి.గన్నవరంలో పలువురు టీడీపీ శెట్టిబలిజ నాయకులు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో ఇచ్చిన జీవోను కూటమి ప్రభుత్వం శెట్టిబలిజగా సవరించిందన్నారు. టీడీపీ శెట్టిబలిజ సంఘ నాయకులు దొమ్మేటి వెంకట రామారావు, దొమ్మేటి శ్యామ్ కుమార్, కుడిపూడి శంకర్‌లాల్, సంసాని పెద్ది రాజు, గుడాల వెంకటరమణ, దొమ్మేటి రవి, విత్తనాల ఆదినారాయణ పాల్గొన్నారు.



అల్లవరం: మాట్లాడుతున్న టీడీపీ శెట్టిబలిజ నాయకులు

ప్రైవేటీకరణను నిరసిస్తూ సేవ్ ఆర్టీసీ డే

అమలాపురం రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బస్సుల పాలసీ పేరుతో ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ అఖిల భారత ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు అమలాపురం ఆర్టీసీ డిపోలో శుక్రవారం సేవ్ ఆర్టీసీ డే నిర్వహించారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆర్టీసీ ద్వారానే ఎలక్ట్రిక్ బస్సులు నిర్వహించాలని, మహిళలకు ఉచిత బస్సు పథకంలో భాగంగా కొత్త బస్సులు కొనుగోలు చేయాలి, డ్రైవర్, కండక్టర్ పోస్టులను భర్తీ చేయాలని యూనియన్ జిల్లా ఉపకార్యదర్శి కె.రంగప్రసాద్ డిమాండ్‌చేశారు. నిరసనలో కె.భీమేశ్వరరావు, కేవీ రావు, కోటేశ్వరరావు, కె.రాంబాబు పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా రామకృష్ణంరాజు



ఐ.పోలవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా దాట్ల రామకృష్ణంరాజు నియామకానికి రంగం సిద్ధం చేశారు. దేవస్థానానికి పది మంది సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని నియమించాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. ట్రస్టు బోర్డు సభ్యులుగా దాట్ల రామకృష్ణంరాజు, పెద్దింటి శ్రీవాణి, పెన్మెత్స రామరాజు, చవటపల్లి నాగేంద్రరావు, కర్రి చంద్రశేఖర్, విత్తనాల సత్యనారాయణ, గంగుల జయలక్ష్మి, గొల్లపెల్లి సునీత, పాటి సీతామహాలక్ష్మి, మద్దాల వెంకటేశ్వరరావులను ఎంపిక చేసి దేవదాయశాఖకు జాబితా నివేదించారు. పాలకవర్గం నియామకం చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆశీస్సులతో రామకృష్ణంరాజు చైర్మన్ కానున్నారు.

ఢిల్లీ కిల్కారి బృందం.. కొత్తలంక పీహెచ్‌సీ సందర్శన

ముమ్మిడివరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కొత్తలంక పీహెచ్‌సీని ఢిల్లీ హార్మన్ కిల్కారి సెంటర్ బృందం శుక్రవారం సందర్శించింది. సెంట్రల్ టీమ్ నుంచి విచ్చేసిన ఎమిట్, కిల్కారి ఎస్పీఎం రాజులు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ముకుంద, వైద్య సిబ్బందితో మట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతల కోసం కిల్కారి కాల్స్‌ను ప్రవేశపెట్టిందని,తల్లీబిడ్డల ఆరోగ్య సమాచారం అందిస్తుందన్నారు. కిల్కారి కాల్స్ 911 60 0103660 నుంచి కాల్ వస్తుందని మరలా వినాలంటే 14423కి చేసి వినవచ్చన్నారు. తర్వాత క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఢిల్లీ నుంచి విచ్చేసిన బృందంలో ఎమిట్, భూషణ్, కిరణ్, డీఏవో డాక్టర్ బీవీవీ సత్యనారాయణ,డీపీఎంవో డాక్టర్ టి.కె.శ్రీనివాస్, ఎంపీహెచ్ఎస్ సత్యనారాయణ, పీహెచ్‌సీ సిబ్బంది సీహెచ్ఎన్ విమలకుమారి, హెచ్‌వీ శాంతకుమారి, శివరామకృష్ణ, సత్యనారాయణ, కిల్కారి ఎస్పీఎంరాజు పాల్గొన్నారు.

బీజేపీ మండల సమావేశం

అంతర్వేది, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గొందిలో బీజేపీ మండల సర్వసభ్య సమావేశాన్ని చెంపాటి శివరామకృష్ణంరాజు వసతిగృహం వద్ద మండలాధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన మోదీజన్మదినం సందర్భంగా ఈనెల15 నుంచి అక్టోబరు2వరకు సేవా పక్షోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తామని మండల పర్యవేక్షకుడు వడ్లమూడి ప్రకాష్, సేవా పక్షోత్సవాల మండల కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు తెలిపారు. రుద్రరాజు కృష్ణంరాజు, బోనం నాయుడు, రావూరి బాబ్జి, యెనుముల సుబ్బారావు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం ప్రధాన కార్యదర్శిగా రాము



రాజోలు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి):తాటిపాకలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘ భవనంలో అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా రాజోలుకు చెందిన కాండ్రేగుల రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జనసేన సభ్యత్వంతో ఆర్థిక భరోసా



జనసేన ఇన్సూరెన్సు చెక్కు అందిస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో కుటుంబ యజమానిని కోల్పోయి ఇబ్బందుల్లో ఉంటున్న కుటుంబాలకు జనసేన పార్టీ ఏర్పాటుచేసిన ఇనూరెన్సు ఎంతో అండగా ఉంటుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం కేశనపల్లిలో కొప్పాడి ఏడుకొండలు ప్రమాదవశాత్తూ మృతిచెందగా ఆ కుటుంబానికి జనసేన సభ్యత్వ ఇన్సూరెన్సు ద్వారా వచ్చిన రూ.5లక్షల చెక్కును ఆయన అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన పార్టీ ఆపదలో ఉన్న కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తుందన్నారు. ఏ కార్యకర్తకు ఇబ్బంది కలిగినా పార్టీ వెంటనే స్పందించేందుకు పవన్‌కల్యాణ్ ఉన్నారన్నారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, దిరిశాల బాలాజీ, అడబాల నాని, పినిశెట్టి బుజ్జి, గుబ్బల ఫణికుమార్, యెనుముల బాబ్జి పాల్గొన్నారు.

రూ.5లక్షల చెక్కు అందజేత

అల్లవరం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి):డి.రావులపాలేనికి చెందిన జనసైనికుడు కొల్లా దుర్గాప్రసాద్‌స్వామినాయుడు గత ఏడాది విద్యుత్ ప్రమాదంలో మృతిచెందాడు. ప్రసాద్ భార్య కొల్లా దుర్గాభవానీకి రూ.5లక్షల బీమా చెక్కును శుక్రవారం జనసేన నాయకుడు పప్పుల దుర్గాప్రసాద్ అందజేశారు. జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, ఆర్డీఎస్ ప్రసాద్, లింగోలు పండు, యేడిద శ్రీను, గునిశెట్టి చినబాబు, కొప్పుల నాగమానస, కంకిపాటి వీరబాబు, కంకిపాటి గోపి, చాట్ల మంగతాయారు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, తిక్కా శేషుబాబు, టీడీపీ నాయకుడు ఆకుల లక్ష్మణరావు పాల్గొన్నారు.

జేఏవోగా పదోన్నతులు

యానాం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తోన్న సూపరింటెండెంట్లు 23మందికి జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏవో)గా పదోన్నతి కల్పిస్తూ పుదుచ్చేరి ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. యానానికి సంబంధించి ముగ్గురికి పదోన్నతులు లభించాయి. యానాం డీఏటీలో పనిచేస్తోన్న బి.సీతామహాలక్ష్మిని యానాం ఆరోగ్యశాఖకు, ఐటీఐలో పనిచేస్తోన్న సాధనాల వీరవెంకటసత్యనారాయణ(బాబు)ను పుదుచ్చేరిలోని ఎంఎన్‌జీపీ పాలిటెక్నిక్‌కు, విద్యాశాఖలో పనిచేస్తోన్న ఉందుర్తి శ్రీనివాస్‌రావును పుదుచ్చేరిలోని డీడీస్పోర్ట్స్‌కు జేఏవోగా పదోన్నతి కల్పించారు. యానాం ప్రభుత్వాసుపత్రిలో జేఏవోగా విధులు నిర్వహిస్తున్న బేతాళం కుమార్‌ను యానాం ప్రజాపనులశాఖ జేఏవోగా బదిలీ చేశారు.

తాగునీటి సమస్యపై గళమెత్తిన సభ్యులు
ఐ.పోలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఐ.పోలవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపించాలని పలువురు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోర్త రాణీమిరియంజ్యోతి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని జడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు అన్నారు. ఎమ్మెల్యే బుచ్చిబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిపై పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు విజ్ఞప్తి చేశారు. యూరియా బ్లాక్ మార్కెట్ జరక్కుండా చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఎంపీపీ కోరారు. అధికార యంత్రాంగం ఎల్లవేళలా ప్రజాప్రతినిధులతో సమన్వయపూర్వకంగా నడుచుకుంటూ సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి కృషి చెయ్యాలన్నారు. సమావేశంలో పాలనాధికారి మంద లక్ష్మీనరసింహంతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి వర్ధంతి

ముమ్మిడివరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం సీపీఎం పార్టీ కార్యాలయం వద్ద సకిలే సూర్యనారాయణ అధ్యక్షతన సీపీఐ పార్టీ నాయకుడు సీతారాం ఏచూరి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. సీతారాం చిత్రటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడారు. సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకుని పోరాడే పద్ధతిలో జీవితాన్ని సాగించారన్నారు. కార్యక్రమంలో పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, కె.లక్ష్మణరావు, విత్తనాల ఏడుకొండలు, గోవిందు, వీర్రాజు, దుర్గారావు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

అంబాజీపేట,సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి):యూరియా అందుబాటులో ఉందని సొసైటీ చైర్‌పర్సన్ అల్లాడ సూర్యనారాయణమూర్తి(రవి) అన్నారు. గంగలకుర్రు సొసైటీలో ఉన్న యూరియా నిల్వలను ఆయన పరిశీలించారు. సొసైటీలకు సెలవులు లేకుండా యూరియా అందిస్తామన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడిగా సురేష్



కాట్రేనికోన, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ కాట్రేనికోన మండల అధ్యక్షుడిగా చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పార్టీ మండల కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎందరినో ఉత్తమ నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని ఆయన అన్నారు. టీడీపీ మండల కార్యదర్శిగా ఇ.శివశంకర్, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహాయం

మామిడికుదురు, సెప్టెంబరు 12 ఆంధ్రజ్యోతి): లూటుకుర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు 1981-85 లో 6నుంచి 10వ తరగతి చదవిన పూర్వ విద్యార్థులు రెండు బీరువాలను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు జి.నాగప్రసాద్‌కు అందజేశారు

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



కపిలేశ్వరపురం మండలం అంగరలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రేషన్ పంపిణీలో అవకతవకలకు తావులేదు

• స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి):రేషన్ పంపిణీలో అవకతవకలకు తావు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం స్మార్ట్ కార్డుల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అంగర రేషన్‌షాపు నెం.13లో గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక విధానంలో రేషన్ పంపి ణీ చేయడం ఒక విప్లవాత్మక మార్పు అని అన్నారు. లబ్ధిదారులు కార్డులు తీసుకునే సమయంలో వాటిలో ఏమైనా మార్పులు చేయాల్సి ఉన్నట్లయితే వాటిని వెనక్కి ఇస్తే అధికారులు సరిచేసి ఇస్తారని, ఇది నిరంతరం ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. మండల ప్రత్యేక అధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ద్వారా రేషన్ తీసుకున్న వెంటనే అధికారులకు సమాచారం అందుతుంద, దీనిద్వారా అక్రమాలు అరికడతామన్నారు. తహశీల్దారు వి.శ్రీనివాస్, ఎంఎస్‌వో పద్మ తదితరులు మాట్లాడుతూ మండలం లో 42 రేషన్ షాపులకుగాను కొత్తకార్డులు 434తో కలిసి మొత్తం 21వేల 511 పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వల్లూరు సచివాలయంలో గ్రామ సర్పంచ్ దాసి మీనాకుమారి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ పాల్గొని స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్ డిప్యూటీ ఎంపీడీవో మోహన్, ఆర్ఐ అర్జమ్మ, సూపరింటెంట్ శ్రీనివాస్, గ్రామ ప్రముఖులు, కూటమి నాయకులు ఉత్సల శ్రీనివాస్, గుడాల జయబాబు, వల్లూరి వీరబాబు, సిద్ధిరెడ్డి రామలింగేశ్వరరావు, పిల్లా బసవరాజు, అంగర రామ నరసింహరావు తదితరులు, రేషన్ డీలర్లు , రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

కె.గంగవరం,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన స్మార్ట్ రైస్ కార్డులు శుక్రవారం మండలంలో పంపిణీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు సమక్షంలో రేషన్‌డీలర్లు, రెవెన్యూ సిబ్బంది కార్డులను లబ్ధిదారులకు బయోమెట్రిక్ వేసి కార్డులను అందజేశారు. తహశీల్దార్ పి.శ్రీరామ ప్రసాద్ రైస్‌కార్డుల పంపిణీని పర్యవేక్షించారు.



పసలపూడి, యండగండిలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

రాయవరం(ఆంధ్రజ్యోతి):మండలంలోని పసలపూడి గ్రామంలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రేషన్ పంపిణీ పారదర్శకంగా చేపట్టేందుకు స్మార్ట్ రేషన్‌కార్డులు ప్రజలకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. అనంతరం స్మార్ట్ రేషన్‌కార్డులను ప్రజా ప్రతినిధులు చేతులమీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో సహకారసంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ సత్తి వెంకట కృష్ణారెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సతీష్‌రెడ్డి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రేషన్‌షాపులవద్ద ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్‌రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం చురుగ్గా నిర్వహిస్తున్నారు. కూటమి పార్టీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామా ల్లో కార్డుదారులకు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్నారు. ఈకార్యక్రమాన్ని తహశీల్దారు రాజేశ్వరరావు పర్యవేక్షిస్తున్నారు.



రావులపాలెంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

గ్రామాల అభివృద్ధికి కృషి

• ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలో శుక్రవారం రూ.1.42కోట్లతో నిర్మించిన సీసీ రోడ్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అలాగే రావులపాడు, లక్ష్మీపోలవరం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో శివారు ప్రాంతాలు సైతం అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. జగన్ పాలనలో కనీసం మౌలికవసతుల కల్పనలో పూర్తిగా విఫలమవ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కుంటిపడిందన్నారు. రావులపాలాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు అన్నివిధా లా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, రా ష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రా మకృష్ణ, పాలూరి సత్యానందం, గుత్తుల రాంబా బు, కొప్పిశెట్టి ప్రసాద్, అంబటి కిషోర్, కొవ్వూరి అచ్చిరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పురుగుమందులు సామాజిక బాధ్యతతో అమ్మాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎరువులు, పురుగుమందుల వ్యాపారులు

ద్రాక్షారామ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుమందుల డీలర్లు పురుగుమందుల అమ్మకం సామాజిక బాధ్యతతో అమ్మాలని ఏడీఏ నాగకుమార్ కోరారు. శుక్రవారం ద్రాక్షారామలో రైతు సేవా కేంద్రంలో ఎరువులు, పురుగుమందుల డీలర్లకు మంత్రి సుభాష్ ఆదేశాలతో అవగాహన సమావేశం నిర్వహించారు. అత్యంత విషపూరితమైన కలుపు మందులు రైతులుగా ధ్రువీకరించుకుని బిల్లులు రాసి మాత్రమే విక్రయించాలని కోరారు. మందుల కొనుగోలుకు వచ్చిన వారు ఏదైనా ఆందోళనతో వచ్చినా, చిన్నవయస్సువారు వచ్చినా ఎట్టి పరిస్థితుల్లోను వారికి అమ్మవద్దని కోరారు. వారి కుటుంబీకులకు సమాచారం ఇవ్వాలన్నారు. డీలర్లు వ్యాపారులుగా మాత్రమే కాకుండా రైతులకు మార్గదర్శకులుగా, సలహాదారులుగా ఉండాలని కోరారు. సమావేశంలో సీఐ ఎం.వెంకటనారాయణ తదితరులు మాట్లాడుతూ వ్యాపారులకు తగు సూచనలు చేశారు. పురుగుమందుల వ్యాపారులతో నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారులు టి.వి.ఆర్. మణిదీప్, సద్గురుమూర్తి, వ్యాపారులు పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

ద్రాక్షారామ, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో రామచంద్రపురం మండలం అండర్-14, అండర్-17 బాలురు,బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఎంఈవోలు తెలిపారు. ఈనెల 15న బాలికలు, 16న బాలుర పోటీలు జరుగుతాయని ఎంఈవోలు తాడి వీరరాఘవరెడ్డి, వి.నాగేశ్వరి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగ, చెస్, షటిల్, అథ్లెటిక్స్‌లలో ఎంపికలు జరుగుతాయని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఇన్‌చార్జి సీ.హెచ్.లక్ష్మీ శ్రీనివాస్ తెలిపారు. 2012 జనవరి1 తరువాత జన్మించిన వారు అండర్-14 విభాగం, 2009 జనవరి 1తరువాత జన్మించిన వారు అండర్ 17 విభాగంలోకి వస్తారని వివరించారు. పోటీలకు స్కూల్ గుర్తింపు కార్డులతో రావాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రపురం మండలంలో ప్రధానోపాధ్యాయుల, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్ఎస్‌డీసీఎస్‌పై శిక్షణ

కె.గంగవరం, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15,16 తేదీల్లో లోకలైజేషన్ ఆఫ్ సస్టయినబుల్ గోల్స్(ఎల్ఎస్‌డీ జీఎస్) పై రెండురోజులు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎన్. శ్రీనివాసు తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. డివిజన్ స్థాయిలో రామచంద్రపురం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణకు ఎంపీపీ, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

పసలపూడిలో అన్నసమారాధన

రాయవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి):పసలపూడి గ్రామంలో లక్ష్మీగణపతి ఆలయంవద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 4వేల మందికి భారీ అన్న సమారాధన చేశారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ అజెండా

రావులపాలెం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమిప్రభుత్వం చేస్తున్న అబివృద్ధిని అడ్డుకోవడమే అజెండాగా మాజీ సీఎం జగన్ వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయంవద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు విద్యార్థులకు అందుబాటులోకి తేవడం వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. టెండర్లు రద్దు చేస్తాం,మళ్లీ మేము అధికారంలోకి వస్తాం.. ఎవ్వరూ టెండర్లు వేసిన, పనులు చేసిన రద్దు చేసి డబ్బులు వెనక్కి తీసుకోవడం జరుగుతుందని జగన్ వ్యాఖ్యానించడం ఆయన అరాచక మనస్తత్వానికి నిదర్శనమన్నారు. నాయకులు మాసాబత్తుల ఆనంద రావు, కాసా విజయసాగర్, బొంతు రాంబాబు, విష్ణుమూర్తి, మురళీ పాల్గొన్నారు.

కళాశాల మాజీ అధ్యక్షుడు మృతికి సంతాపం

రావులపాలెం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ రావులపాలెం ప్రభుత్వ కళాశాలలో ప్రస్తుత ఛైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంతాప సభలో కళాశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

పేకాట శిబిరంపై దాడి

ఆత్రేయపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని తాడిపూడిలో శుక్రవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. ఎస్ఐ ఎస్.రాము ఆధ్వర్యంలో పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై దాడులు నిర్వహించగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.3420 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

• డీఈవో సలీంబాషా



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జి ల్లా విద్యాశాఖాధికారి సలీంభాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఐజి ము న్సిపల్ ఉన్నత పాఠశాలలను డీఈవో ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు పరిశీలించారు. మౌళిక వసతులు లేని పాఠశాలల వివరాలు సేకరించి అవసరమైనచో ట వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. పాఠశాలలు ప్రారంభమై మూడునెలలు పూర్తయినందున విద్యార్థుల అభ్యసనస్థాయిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ ప్రవేశపరీక్షకు నోటిఫికేషన్ జారీ అయినందున అధిక సంఖ్యలో విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన బాధ్యత సంబంధిత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. విద్యా కార్యక్రమాల అమలులో డా.బి.ఆర్ అంబేడ్కర్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. ఇటీవల జరిగిన అసెస్‌మెంటు పరీక్షలకు సంబంధించి బుక్‌లెట్స్‌ను తనిఖీచేసి వాటి ఆధారంగా విద్యార్థుల విద్యాస్థాయిని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటి నుంచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలు హెచ్‌ఎంలు రాఘవరెడ్డి, సీహెచ్‌వీ సత్యనారాయణమూర్తిలు డీఈ వోకు వివరించారు. ఆయన వెంట జిల్లా సైన్సు అధికారి జి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు, ఎంఈవోలు టి.వీర్రాఘవరెడ్డి, వి.నాగేశ్వరి, సీఆర్‌పీ వెంకన్నబాబు, అపర్ణ, రాధాకుమారి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే బండారు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయంవద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభు త్వం పనిచేస్తుందన్నారు. ప్రజా సమస్యలు నిరంతరం తెలుసుకుని ఆసమస్యలను సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులకు అప్పగించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

భక్తజన పూజలు



శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రదక్షణలు నిర్వహిస్తున్న భక్తజనం

ఆత్రేయపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం, కుంకుమ పూజ, తదితర సేవా కార్యక్రమాలను అర్చక బృందం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రదక్షణలు నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామివారి సన్నిధికి కాలినడకన భక్తులు చేరుకున్నారు. శనివారం వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. క్యూలైన్లు విస్తరణ, అభివృద్ధి పనులను ఈవో చక్రధరరావు పరిశీలించారు.

సేవా పక్వాడ్ పక్షోత్సవాలు నిర్వహించాలి



బీజేపీ సేవా పక్వాడ వర్క్‌షాపులో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

కొత్తపేట,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని సేవాపక్వాడ్ పక్షోత్సవాలు నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల బీజేపీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు అధ్యక్షతన సేవా పక్వాడ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రవేశపెట్టిన వికసిత్ భారత్, ఆత్మ నిర్భర్ భారత్, డిజిటల్ ఇండియా గురించి ప్రచారం నిర్వహించాలన్నారు. జీఎస్టీపై తీసుకున్న నిర్ణయం పట్ల ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించే విధంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణను మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్, పాలూరి జయప్రకాశ్‌నారాయణ, దొడ్డా నాగబాబు, దత్తాత్రేయ, కోటపల్లి దామోదర్, గొలకోటి వెంకటేశ్వరరావు, కుడుపూడి దావీద్, పాలాటి మాధవస్వామి, భమిడిపాటి లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా రమేష్ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న సలాది పట్టాభిరామయ్య

కె.గంగవరం, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యవాడ గ్రామానికి చెందిన సలాది పట్టాభి రామయ్య(రమేష్) శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. రమేష్‌కు పదవి రావడంపై టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, నాయకులు రావిపాటి వెంకట గణేష్ చౌదరి, గన్ని శ్రీనివాసు, తోట వెంకన్న, జగతా రమణ, నిడదవోలు సుబ్రహ్మణ్యం, రవి, మరివాడ చిన్నికృష్ణ, కొత్తపల్లి మొరార్జీ తదితరులు రమేష్‌కు అభినందనలు తెలిపారు.

రేపు ఘనంగా గన్నమని శతజయంతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాస్

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కపిలేశ్వరపురం గ్రామంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త దివంగత గన్నమని ఆనంద రావు శతజయంతి వేడుకలను గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేఖ ర్ల సమావేశంలో గ్రామప్రముఖులు నెక్కంటి శ్రీరాంజీ, పర్వతిన మురళీకృష్ణ, బలవరెడ్డి సత్తిబాబు, జుత్తుగ మల్లిఖార్జునుడు మాట్లాడారు. గ్రామానికి చెంది న గన్నమని వైజాగ్, ఒరిస్సాలలో స్థిరపడినప్పటికీ గ్రామానికి ఏదో ఒకటి చేయాలన్న తపనతో విద్య, వైద్యపరంగా ఎన్నో సేవలను అందించి ప్రజల్లో మంచి గుర్తింపు పొందారన్నారు. ఆయన 1997 తుఫానులో ఒరిస్సా నుంచి గ్రామానికి చేరుకుని ప్రజలకు రేషన్ అందిం చడం, జన్మభూమి కార్యక్రమంలో మా ర్కెట్ యార్డు, గ్రంథాలయం నిర్మించడం జరిగిందన్నారు. ఆయన వారసత్వాన్ని అందుకున్న కుమారులు మోహనరావు, మురళీకృష్ణలు కరోనాసమయంలో సీహెచ్‌సీకి రూ.80లక్షలు విలువైన ఆక్సిజన్ ప్లాంట్ సమకూర్చి ఎంతో మం దికి ప్రాణదాతలుగా నిలిచారన్నారు. శతజయంతి ఉత్సవాల పేరున ఆదివా రం గ్రామంలోని గ్రంథాలయంలో ఆయ న విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అలా గే జడ్పీ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం, పీహెచ్‌సీలో 2డి, ఏకో, థైరాయిడ్ మిషన్, ఇతర పరికరాల ఏర్పాటు, వేదిక ప్రాంగణం నుం చి హిందూ శ్మశానవాటిక శిలాఫలకం ఆవిష్కరణ, ప్రతిభకనబర్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ, అనంతరం జ్యోతిప్రజ్వలన, ముఖ్యఅతిథుల ప్రసంగం, అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన జరుగనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో గన్నమని కుటుంబీకులు మోహనరావు, కొరపాటి జానకిరామయ్య(రాంబాబు), ఒంటిపల్లి అబ్బు, మల్లిపూడి శివకుమార్, కుడిపూడి సురేష్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఖబ్రస్థాన్ స్థలం కేటాయించాలి

• ఎమ్మెల్యేను కలిసిన ముస్లిం పెద్దలు



ఎమ్మెల్యే వేగుళ్లను కలిసి మాట్లాడుతున్న ముస్లిం పెద్దలు

మండపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) మండపేట పట్టణంలో వున్న ముస్లింలకు సంబంధించి పెద్దమసీదు వద్ద వున్న ఖబ్రస్థాన్ శ్మశాన వాటిక స్థలం చాలటంలేదని, తమకు శ్మశానవాటిక స్థలంను కేటాయించాలని పట్టణ ముస్లింపెద్దలు శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్లను కలిసి వినతిపత్రం అందజేశారు. చాలాకాలం నుంచి తమకు శ్మశానవాటిక చాలకపోవటం స్థలంలేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థలం కేటాయించాలని వారు వేగుళ్లను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని ముస్లింపెద్దలు తెలిపారు. పట్టణానికి చెందిన వివిధ మసీదులకు చెందిన ముస్లిం పెద్దలు అంతా ఎమ్మెల్యే వేగుళ్లను కలిసి తమ సమస్యను తెలిపారు. ముస్లిం జేఏసీ తరఫున ఎమ్మెల్యేను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్ షేక్ ఇబ్రహీం. జేఏసీ సభ్యులు అల్తాఫ్, ఖరీం ఖాదరీ, ఖరీం, ఇబ్రహీంగౌస్, రహింఅర్షి, ఫారుఖ్,ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం



వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కె.గంగవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఒత్తిడి రహిత విద్యావిధానం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, జ్ఞానవికాసం సాధ్యమవుతుందని, ఆదిశగా కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు ఆదర్శ ఉపాధ్యాయుడు అని వక్తలు అన్నారు. శుక్రవారం కె.గంగవరం ఉన్నత పాఠశాల ఆవరణలో వెంకటేశ్వరరావు దంపతులకు ఉపాధ్యాయులు ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖ అధికారి ఏ.నాగరాజు, అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.